నవంబరు 15న సత్యదేవుని గిరిప్రదక్షిణ

గత సమస్యలు పునరావృతం కాకుండా ప్రణాళిక

అన్నవరం, న్యూస్‌టుడే: కార్తీక పౌర్ణమి రోజు నిర్వహించే అన్నవరం సత్యదేవుని గిరి ప్రదక్షిణకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఆ రోజున రత్న, సత్యగిరుల చుట్టూ సుమారు 8.4 కి.మీ మేర సాగే ప్రదక్షిణకు దేశంలోని వివిధ ప్రాంతాలతోపాటు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి లక్షలాదిమంది భక్తులు పాల్గొంటారు. దర్శనం, వ్రతాలకు తీవ్ర రద్దీ నెలకొంటుంది. ఈ ఏడాది నవంబరు 15న గిరి ప్రదక్షిణ ఉండనుంది. ఏటా ఉదయం 8 గంటలకు కొండ దిగువన తొలిపావంచాల వద్ద సత్యరథానికి పూజలు చేసి ప్రదక్షిణ ప్రారంభిస్తుంటారు. ఇదే సమయానికి భక్తులు వేలాదిగా పాల్గొంటుండటంతో నియంత్రణ, సౌకర్యాల విషయంలో ఇబ్బందులు వస్తున్నాయి. దీంతో ఈసారి మధ్యాహ్నం 2 గంటలకు సత్యరథాన్ని ప్రారంభిస్తారు. వైదిక కార్యక్రమాలన్నీ తొలుత నిర్వహించి ఆ తర్వాత రథాన్ని ప్రారంభిస్తే ఉదయం నుంచే భక్తులు గిరిప్రదక్షిణలో ఉంటారని.. తద్వారా కొండ దిగువన, పైన ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయవచ్చని అధికారులు భావిస్తున్నారు. సింహాచలంలో ప్రస్తుతం ఇదే పద్ధతి అవలంబిస్తున్నారు. అక్కడ కొండ దిగువన తొలిపావంచాల వద్ద మధ్యాహ్నం 2 గంటలకు అప్పన్న పుష్పరథాన్ని ప్రారంభిస్తారు. భక్తులు ఉదయం నుంచే గిరిప్రదక్షిణ చేస్తుంటారు.



గత ఏడాది నవంబరు 27న సత్యదేవుని దర్శనానికి కిక్కిరిసిన భక్తులు (కొండపైన)

● నాడు తీవ్ర అవస్థలు

అన్నవరంలో గతేడాది నవంబరు 27న గిరి ప్రదక్షిణ నిర్వహించగా రెండు లక్షల మంది హాజరయ్యారు. ఇదే సమయంలో దర్శనానికి సుమారు 1.50 లక్షల మంది రావడం. వ్రతాలు కూడా 16వేల వరకు జరగడంతో కొండపైన ప్రాంగణాలు కిక్కిరిసిపోయాయి. ఏర్పాట్లు పూర్తిస్థాయిలో చేయలేక ఇబ్బందులు ఎదురయ్యాయి. గత అనుభవాలు, ప్రదక్షిణలో పాల్గొనే భక్తుల సంఖ్య పెరుగుతుండటంతో ఈ దఫా సమస్యలకు ఆస్కారం లేకుండా చేయాలని యోచిస్తున్నారు. ఈవో కె.రామచంద్రమోహన్ మాట్లాడుతూ "కార్తిక పౌర్ణమి రోజున గిరి ప్రదక్షిణ, సత్యదేవుని దర్శనానికి వచ్చే భక్తులకు కొండపైన, దిగువన ఇబ్బందులు లేకుండా చూడాల్సి ఉంది. ఈ నేపథ్యంలో సత్యరథాన్ని మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభించాలని భావిస్తున్నాం. దీంతో భక్తులకు సౌకర్యవంతంగా ఏర్పాట్లు చేయడానికి వీలుంటుంద'ని తెలిపారు.

17న డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

అమలాపురం గ్రామీణం: డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమాన్ని ఈ నెల 17న నిర్వహిస్తున్నట్లు అమలాపురం డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రయాణికులు 95819 32678 నంబరులో సంప్రదించి సలహాలు, సూచనలు అందించాలని కోరారు.

రూ.54 కోట్లతో 99 రహదారుల అభివృద్ధి

ఆలమూరు, న్యూస్‌టుడే: కోనసీమ జిల్లా రైతుల ప్రయోజనం కోసం 99 అనుసంధాన రహదారుల అభివృద్ధికి రూ.54 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించినట్లు జిల్లా అగ్రిట్రేడ్-మార్కెటింగ్ అధికారిణి కె.విశాలాక్షి తెలిపారు. మంగళవారం ఆలమూరు మార్కెట్ కమిటీ దస్త్రాలు పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రైతుబంధు పథకం ద్వారా నిల్వ చేసుకున్న ధాన్యం, ఇతర పంట నిల్వలపై రుణాల మంజూరుకు రంగం సిద్ధమవుతోందన్నారు. కల్లాల్లో ధాన్యం ఆరబెట్టేందుకు మార్కెట్ కమిటీలు బరకాలు ఇస్తున్నాయన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వేయింగ్ మిషన్లు, తేమశాతం నిరారణ యంత్రాలు అందజేస్తున్నట్లు తెలిపారు. కొత్తపేట, రావులపాలెం, మండపేటలో రైతుబజార్లు నిర్వహిస్తున్నామన్నారు.

ముగిసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు నమోదు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు నమోదుకు మంగళవారంతో గడువు ముగిసింది. సెప్టెంబరు 3 వరకు అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. విచారణ పూర్తి చేసి, 24న ముసాయిదా జాబితా ప్రచురించారు. అభ్యంతరాల స్వీకరణతో పాటు ఈనెల 15 వరకు మిగిలిపోయిన అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఇప్పటివరకు వచ్చినవాటిపై ఈనెల 30లోగా విచారణ చేసి, నవంబరు 6న తుది జాబితా ప్రకటిస్తారు. గతనెల 24 నుంచి ఈనెల 15 వరకు కాకినాడ, కోనసీమ, తూర్పు, పశ్చిమగోదావరి, ఏలూరు, అల్లూరి జిల్లాల్లో ఓటు నమోదుకు వచ్చిన దరఖాస్తుల వివరాలు మంగళవారం రాత్రికి కాకినాడ కలెక్టరేట్‌కు చేరలేదు. బుధవారం కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.

బ్రాండ్ బాజా

నేటి నుంచి కొత్త మద్యం దుకాణాలు

లైసెన్సుల జారీతో అమ్మకాలకు ఏర్పాట్లు




ఈనాడు, కాకినాడ: మద్యం దుకాణాల కేటాయింపులో కీలక ఘట్టం ముగియడంతో దుకాణాల ఏర్పాటులో ప్రైవేటు వ్యాపారులు హడావిడిగా ఉన్నారు. వైకాపా హయాంలో ప్రభుత్వమే ఈ దుకాణాలు నడిపేది. నాసిరకం బ్రాండ్లు అందుబాటులోకి తేవడంతో ఆరోగ్యాలు దెబ్బతిన్నాయని చాలామంది ఆవేదన వ్యక్తంచేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక పాత ప్రక్రియను రద్దుచేసి కొత్త మద్యం విధానం తెరమీదికి తెచ్చింది. నిర్దిష్టమైన బ్రాండ్లను అందుబాటులోకి తెచ్చేలా చర్యలు చేపట్టింది. కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో 413 దుకాణాలు మంజూరుచేసింది. సోమవారం నిర్వహించిన లాటరీలో వీటిని దక్కించుకున్నవారు అబ్కారీ శాఖ నుంచి ప్రొవిజనల్ లైసెన్సులు పొంది.. బుధవారం నుంచి దుకాణాలు తెరవబోతున్నారు.

నాటుసారా సెగ

ఉమ్మడి జిల్లాలో 32 మండలాల పరిధిలోని 120 గ్రామాల్లో నాటుసారా తయారీ విచ్చలవిడిగా సాగుతున్నట్లు గతంలో అబ్కారీశాఖ అంచనా వేసింది. ఏటా సారా వ్యాపారం రూ.150 కోట్లు పైనే. వైకాపా ప్రభుత్వ హయాంలో సెబ్ పేరుతో ప్రత్యేక విభాగం ఏర్పాటుచేసినా ఫలితం లేకపోయింది. మద్యం దుకాణాల ద్వారా వచ్చే ఆదాయానికి నాటుసారా గండికొట్టే ప్రమాదం ఉండడంతో ఆందోళన దుకాణదారుల్లో నెలకొంది. నిబంధనల మేరకు మద్యం దుకాణాలు నడిచేలా చూడటంతోపాటు.. నాటుసారా ఉత్పత్తిని సమర్థంగా అడ్డుకోవాలని ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ డీసీ వైద్యనాథ్ తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో నిఘా పెంచుతామన్నారు.

చకచకా ఏర్పాట్లు


మద్యం దుకాణదారులు ప్రాథమికంగా లైసెన్సు రుసుములో 1/6 వంతు మొత్తాన్ని చెల్లించి, మిగిలిన మొత్తానికి బ్యాంకు గ్యారెంటీ ఇవ్వాల్సి ఉంది. వారికి ప్రొవిజనల్ లైసెన్సు ఇస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటల సమయానికి ఉమ్మడి జిల్లాలో 373 దుకాణాలకు లైసెన్సులు మంజూరుచేశారు. రాత్రికి నూరు శాతం పూర్తిచేసి బుధవారం నుంచి వ్యాపారాలకు వెసులుబాటు కల్పిస్తున్నారు. ● కాకినాడ జిల్లాలోని మద్యం దుకాణాలకు సామర్లకోట డిపో.. కోనసీమలోని దుకాణాలకు అమలాపురంలోని డిపో నుంచి మద్యం నిల్వలు సరఫరా అవుతాయి. తూర్పుగోదావరిలోని రాజమహేంద్రవరం పరిధిలో దుకాణాలకు రాజమహేంద్రవరం డిపో నుంచి.. నిడదవోలు, దేవరపల్లి, కొవ్వూరు పరిధిలోని దుకాణాలకు వాళ్ల డిపో నుంచి సరఫరా చేస్తారు. లైసెన్సుదారుకు కేటాయించిన ఐడీ ఆధారంగా ఏ బ్రాండు కావాలో డిపోల నుంచి కొనుక్కునే వెసులుబాటు కల్పించారు. ● ఒక్కసారిగా డిమాండ్ ఆధారంగా దుకాణాల కొరత, అద్దెల దరువు వ్యాపారులకు ఇబ్బందిగా మారింది. విద్యాలయాలు, గుర్తింపు పొందిన దేవాలయాలు/ మసీదు/ చర్చిల ఆవరణలో దుకాణాలు ఉండకూడదని అబ్కారీ శాఖ స్పష్టం చేసింది. దీంతో ఇటువంటి లోపాలకు ఆస్కారం ఇవ్వకుండా పరిశీలిస్తున్నారు.



ఈనాడు, కాకినాడ: ఉమ్మడి తూర్పుగోదావరిలోని మూడు జిల్లాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇన్‌ఛార్జి మంత్రులను నియమించింది. ఆయా జిల్లాల్లో అమలయ్యే ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షించి, పర్యవేక్షించే బాధ్యత అప్పగించింది. కాకినాడ జిల్లా ఇన్‌ఛార్జిగా పురపాలక- పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణను నియమించారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ ఇన్‌ఛార్జిగా వ్యవసాయ- సహకార- మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు.. తూర్పుగోదావరి జిల్లాకు జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడును నియమించారు.



పొంగూరు నారాయణ



కింజరాపు అచ్చెన్నాయుడు



డాక్టర్ నిమ్మల రామానాయుడు

జిల్లాకో సారథి.. అభివృద్ధికి వారధి

❖ అంబేడ్కర్ కోనసీమకు ఇన్‌ఛార్జిగా అచ్చెన్నాయుడు

❖ కాకినాడ- నారాయణ; తూర్పునకు రామానాయుడు

గత వైకాపా పాలనలో వ్యవస్థలు గతితప్పాయి.. అనేక కీలక సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. వీటిని గాడినపెట్టే పనిలో కూటమి ప్రభుత్వం ఉంది. పాలన కుదుటపడ్డాక ఇన్‌ఛార్జి మంత్రులను నియమించింది. వ్యవసాయ ఆధారిత జిల్లాలు కావడం.. రెండు నగరాలు, కీలక పట్టణాలు ఉండడంతో మంత్రులు పరిస్థితి చక్కదిద్ది, ప్రగతిని పట్టాలెక్కిస్తారనే ఆశాభావం వ్యక్తమవుతోంది.

ఆశలన్నీ అమాత్యులపైనే..

❖ డెల్టాలకు ఆధారమైన కాటన్ బ్యారేజీని బలోపేతం చేసి ఆ పరిధిలోని సాగునీటి, మురుగు పారుదల వ్యవస్థలను ఆధునికీకరించాలి. ఈ ప్రక్రియ సమర్థంగా పూర్తయితే ముంపు సమస్యకు, శివారు సాగునీటి కష్టాలకు పరిష్కారం దొరికినట్లే.. ❖ ఉమ్మడి జిల్లాతోపాటు విశాఖ అవసరాలు తీర్చేందుకు నిర్దేశించిన పోలవరం ఎడమ ప్రధాన కాలువ కొలిక్కి వస్తే సాగు, తాగు, పారిశ్రామిక అవసరాలకు నీళ్లు అందుబాటులోకి వస్తాయి. ❖ ఏటా విపత్తులు, వరదలతో ఎదురయ్యే నష్టాన్ని తగ్గించే దిశగా చర్యలకు ఉపక్రమించాలి. గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లో కోత నివారణ చర్యలు అవసరం. ❖ ధాన్యాగారంగా పేరున్నప్పటికీ రైతుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. సాగులో ఉన్నది ఎక్కువగా కౌలు రైతులే.. విపత్తులతో ఏటా నష్టపోతున్నవారికి ఊతమివ్వాలి. ధాన్యం కొనుగోలులో దళారీల జోక్యం కట్టడి చేసి, మద్దతు ధర సమర్థంగా అందించాలి. ❖ రూ.వెయ్యి కోట్లతో తలపెట్టిన కాకినాడ ఆకర్షణీయ నగరం పనులు గత ప్రభుత్వ నిర్వాకంతో గతితప్పాయి. గాడిన పెట్టాలి. విలీన గ్రామాల సమస్యకు పరిష్కారం చూపాలి. నగర పాలక సంస్థ ఎన్నికలకు చొరవచూపాల్సి ఉంది.

సమన్వయంతో అభివృద్ధికి కృషి

వ్యవసాయ ఆధారిత అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఇన్‌ఛార్జిగా బాధ్యత చేపట్టడం ఆనందంగా ఉంది. వ్యవసాయ, ఉద్యానవన, మత్స్యకారుల సమస్యలకు ప్రాధాన్యం ఇస్తాము. సహకార రంగం బలోపేతంపైనా దృష్టిసారిస్తా. భాజపా- జనసేన- తెదేపా శ్రేణుల సమన్వయంతో జిల్లాలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతాం. సంక్షేమ కార్యక్రమాల అమలు సమర్థంగా జరిగేలా చూస్తాం.

-కింజరాపు అచ్చెన్నాయుడు, వ్యవసాయ-సహకార-మత్స్యశాఖ మంత్రి

గండాల దారి.. గుంతలతో సవారీ



సామర్లకోట రైల్వే వంతెన వద్ద రహదారి దుస్థితి



కాకినాడ-సామర్లకోట మార్గంలో మాధవపట్నం-కాకినాడ బైపాస్ రైల్వే వంతెన వద్ద ఇలా..

గత వైకాపా ప్రభుత్వం రహదారుల నిర్వహణ, మరమ్మతులు పూర్తిగా విస్మరించింది. చాలాచోట్ల ప్రధాన మార్గాలు సైతం గుంతలు పడి, కంకర రాళ్లు తేలి అధ్వానంగా మారాయి. దీంతో పలువురు ప్రాణాలు కోల్పోయిన పరిస్థితి. కాకినాడ- సామర్లకోట రహదారే ఇందుకు నిదర్శనం. 15 కి.మీ. ఈ మార్గం పెద్ద పెద్ద గుంతలతో ప్రమాదకరంగా మారింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ప్రధాన నగరాలైన రాజమహేంద్రవరం, కాకినాడ నగరాలను కలిపే మార్గాల్లో ఇది ఒకటి. వర్షం పడితే గుంతల్లో నీరు చేరి లోతు తెలియక ప్రయాణం నరకంగా మారింది. ఇటీవల 60 ఏళ్లు దాటిన వృద్ధ దంపతులు ద్విచక్రవాహనంపై వెళ్తూ మాధవపట్నం కాకినాడ బైపాస్ రైల్వే వంతెన దాటిన తర్వాత గుంతలో పడ్డారు. వృద్ధురాలు కిందపడి మృత్యువాత పడ్డారు. యంత్రాంగం స్పందించి ఈ రహదారికి తక్షణ మరమ్మతులు చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు. - ఈనాడు, కాకినాడ

ఆసుపత్రికి వెళ్తూ అనంతలోకాలకు..

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి, భార్యకు తీవ్ర గాయాలు



రాంబాబు, రజిత దంపతులు (పాత చిత్రం)

అమలాపురం పట్టణం, అల్లవరం, న్యూస్‌టుడే: భార్యను ఆసుపత్రికి తీసుకువెళ్తుండగా రోడ్డు ప్రమాదానికి గురై భర్త మృతి చెందాడు. హృదయవిదారక ఈ ఘటన మంగళవారం పేరూరులో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

అల్లవరానికి చెందిన నిచ్చెనకోళ్ల రాంబాబు(65) కల్లుగీత కార్మికుడిగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. భార్య రజిత ఆరోగ్యం బాగాలేకపోవడంతో మంగళవారం ఉదయం ద్విచక్ర వాహనంపై అమలాపురం ఆసుపత్రికి తీసుకువెళ్లేందుకు బయలుదేరారు. పేరూరు పంచాయతీ పరిధిలో విశ్వేశ్వర అగ్రహారం వద్ద వెనుక నుంచి వచ్చిన వ్యాన్ వీరిని బలంగా ఢీకొని రోడ్డుపై పడిపోయిన వారిపై నుంచి వెళ్లిపోయింది. రాంబాబు ఘటనా స్థలంలోనే మృతి చెందారు. రజితకు తీవ్ర గాయాలు కావడంతో అమలాపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రమాద స్థలం రక్తసిక్తమైంది. ప్రమాదం జరిగిన వెంటనే వ్యాన్‌లోని ఇద్దరు వ్యక్తులు వాహనాన్ని వదిలి పరారయ్యారు. ఆ దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై పృథ్వీ తెలిపారు.



ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రజిత

కాలం చెల్లిన ద్రావణం తాగి చిన్నారికి అస్వస్థత

యానాం: యానాం ప్రభుత్వ ఆసుపత్రిలో ఓ చిన్నారికి కాలం చెల్లిన సిరప్ (యాంటీబయోటిక్) ఇవ్వడంతో అస్వస్థతకు గురయ్యాడు. యానాం వెంకట్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తి అనారోగ్యం బారిన పడిన తన ఏడాదిన్నర కుమారుడిని మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. పరీక్షలు చేసిన వైద్యులు మందులు రాసివ్వగా.. ఆసుపత్రిలో వాటిని తీసుకుని ఇంటికి వెళ్లారు. అక్కడ ఇచ్చిన సిరప్‌ను చిన్నారికి వేయగా.. కొద్దిసేపటికే అస్వస్థతకు గురయ్యాడు. సిరప్‌ను పరిశీలించగా కాలం చెల్లినదిగా గుర్తించి వైద్యులను నిలదీశారు. ప్రస్తుతం ఆ చిన్నారిని ఆసుపత్రిలో వైద్యుల పరిశీలనలో ఉంచారు.



జూన్‌తో ముగిసిన గడువు (వృత్తంలో)

వేలాడుతున్న ప్రమాదం

న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

వర్షాల సమయంలో విద్యుత్తు తీగలతో ప్రమాదం పొంచి ఉంటుంది. ఇళ్ల నుంచి ఆరుబయట ప్రాంతాల్లోనూ అప్రమత్తత ఎంతో అవసరం. ఇటీవల పలుచోట్ల విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోయారు. స్తంభాలు విరిగిపడినా, తీగలు తెగినా సమీప ప్రాంతాలకు వెళ్లకుండా సంబంధిత సిబ్బందికి సమాచారం ఇవ్వాలని అధికారులు సూచిస్తున్నారు.

సమస్యలుంటే.. ఇలా చేద్దాం..

విద్యుత్తు అంతరాయానికి టోల్ ఫ్రీ నంబరు: 1912

కంట్రోల్ రూం నంబర్లు

94409 04477 (అమలాపురం)

94931 78821 (రామచంద్రపురం)



జాగ్రత్తలు అవసరం..

● వర్షాల కారణంగా తెగిపడిన విద్యుత్తు తీగలను, తడిచిన విద్యుత్తు స్తంభాలను, తీగలపై పడిన చెట్ల కొమ్మలను తాకకూడదు. ● ఇళ్లపై నుంచి విద్యుత్తు లైన్ వెళ్తుంటే వర్షాలు కురిసే సమయంలో అప్రమత్తంగా ఉండాలి. పిల్లలు డాబాలపై ఆడుకునే సమయంలో ప్రమాదం పొంచి ఉంటుంది. ● ఎవరైనా వ్యక్తి విద్యుదాఘాతానికి గురైతే నేరుగా తాకకూడదు. విద్యుత్తు సరఫరా నిలుపుదల చేయడం, పొడికర్రతో తీగలు తొలగించడం చేయాలి. ● ఇంటి గోడల్లోకి నీటి చెమ్మదిగితే స్విచ్‌బోర్డులు తడవకుండా చూసుకోవాలి. ● ఇళ్లలోని విద్యుత్తు మోటార్లను తాకకూడదు. ● ఆరుబయట ఉన్న తడిసిన విద్యుత్తు స్తంభాలను, వాటికి ఏర్పాటు చేసిన సపోర్టు తీగలకు దూరంగా ఉండాలి.

అప్రమత్తంగా ఉండాలి

వర్షాల కారణంగా విద్యుత్తు ప్రమాదాలకు ఆస్కారం ఉంటుంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. విద్యుత్తు తీగలు తెగిపడినా, చెట్లు విరిగి పడినా తాకే ప్రయత్నం చేయకూడదు. టోల్ ఫ్రీ నంబరుకు సమాచారం అందిస్తే సిబ్బంది వచ్చి సమస్యను పరిష్కరిస్తారు.

-ఎస్.రాజబాబు, ఎస్ఈ, డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా

18న విజయబేతాళస్వామి వాహన మహోత్సవం

అంబాజీపేట, న్యూస్‌టుడే: దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని అంబాజీపేటలో ఈ నెల 18న విజయబేతాళస్వామి వాహన మహోత్సవం, తీర్థం నిర్వహిస్తామని శెట్టిబలిజ అభ్యుదయ సంక్షేమసంఘ అధ్యక్షుడు దొమ్మేటి రామారావు, ఉత్సవ కమిటీ ఛైర్మన్ శీలం సత్యఅర్జునమోహనరావు వెల్లడించారు. స్థానిక శ్రీనివాసనగర్‌లో బేతాళస్వామి ఆలయం వద్ద మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ నెల 16న నిర్వహించాల్సిన వేడుకలను వర్షాల కారణంగా 18న నిర్వహించేందుకు నిర్ణయించామన్నారు. మట్టపర్తి రాము, దొమ్మేటి సత్యమోహన్, విత్తనాల ఇంద్రశేఖర్, దొమ్మేటి శ్యామ్, మట్టపర్తి సోమేశ్వరరావు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఉచిత ఇసుక విధానం

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఉచిత ఇసుక పంపిణీని అత్యంత పారదర్శకంగా అమలు చేయాలని కలెక్టర్ మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉచిత ఇసుక విధానంపై గనులు, రెవెన్యూ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 16 నుంచి ఇసుకను అందుబాటులో ఉంచే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో అందుబాటులో ఉన్న ఇసుక రీచ్‌లలో తవ్వకాలకు చర్యలు చేపట్టాలన్నారు. ఇసుక ధరలను రీచ్‌ల వారీగా జిల్లా ఇసుక కమిటీ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. గోదావరిలో ప్రవాహం తగ్గిన తర్వాత ప్రారంభించే రీచ్‌లకు బోట్స్‌మెన్ సొసైటీలను నియమించుకోవాలన్నారు. గనుల శాఖ అధికారి అశోక్ కుమార్, విజయ్ తదితరులు పాల్గొన్నారు. అమరావతి నుంచి రాష్ట్ర ప్రభుత్వ గనులు, భూగర్భ శాఖ ముఖ్య కార్యదర్శి ముకేష్‌కుమార్ మీనా దూరదృశ్య సమావేశం నిర్వహించి ఉచిత ఇసుక పంపిణీపై సమీక్ష నిర్వహించారు.



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

ఆర్థిక అక్షరాస్యత పెంపొందించడమే లక్ష్యం

ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యతను పెంపొందించేందుకు ఉల్లాస్ కార్యక్రమం ప్రవేశపెట్టినట్లు కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంపై మంగళవారం కలెక్టరేట్ నుంచి దూరదృశ్య సమావేశం నిర్వహించి విధివిధానాలను వివరించారు. స్వయం సహాయక సంఘాల్లో నిరక్షరాస్యులైన మహిళలు, పాఠశాలల్లో పనిచేసే ఆయాలు, వంట పనివారు, అంగన్‌వాడీ ఆయాలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. జిల్లాలో 9 మండలాల పరిధిలోని 7,128 మందికి ఈ పాఠ్యాంశాలు బోధించేందుకు విద్యా వాలంటీర్లను నియమిస్తామన్నారు. ఎంపిక చేసిన వారికి అంగన్‌వాడీ కేంద్రాల్లో సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు శిక్షణ ఇస్తారన్నారు. నవంబరు 5 నుంచి 2025 మార్చి 15 వరకు ఈ శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. జిల్లా వయోజన విద్య అధికారి పి.పోసయ్య, డీఆర్‌డీఏ పీడీ శివశంకరప్రసాద్, డీఈవో కమల కుమారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పాల్ ల్యాబ్‌లను వినియోగించుకోవాలి

ద్రాక్షారామ, న్యూస్‌టుడే : విద్యార్థులు గణితం, ఆంగ్లంలో మెలకువలు సులభంగా నేర్చుకునేందుకు పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పాల్‌ల్యాబ్స్‌ను సమర్థవంతంగా వినియోగించుకునేలా గణితం, ఆంగ్ల ఉపాధ్యాయులు పర్యవేక్షణ చేయాలని డిప్యూటీ కలెక్టరు, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఎ.మధుసూదన్‌రావు సూచించారు. రామచంద్రపురం మండలం ద్రాక్షారామ జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పాల్‌ల్యాబ్‌ను పరిశీలించారు. జిల్లాలో 31 పాల్ ల్యాబ్‌లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మొదటి దశలో 21, రెండో దశలో ఐదు పాఠశాలలు దీనికి ఎంపిక చేసినట్లు వివరించారు. ప్రతి పీఎం శ్రీ పాఠశాల ఆట స్థలం అభివృద్ధికి రూ.5లక్షలు నిధులు మంజూరు చేశామన్నారు. జిల్లాలో ఏడు కెమిస్ట్రీ ల్యాబ్‌ల ఏర్పాటుకు రూ.1.09కోట్లు మంజూరైనట్లు తెలిపారు. అంతకు ముందు పీఎం శ్రీ కింద ఎంపికైన హసనబాద, పట్టణంలో ఎస్‌బజీ మున్సిపల్ పాఠశాలలను సందర్శించి వివరాలు సేకరించారు. సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ అధికారి పి.రాంబాబు, ఐఈ కోఆర్డినేటరు ఎంవీవీ సత్యనారాయణ, ఎంఈవో ఎం.శ్రీనివాస్, వి.నాగేశ్వరి, జిల్లా సైన్సు అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



ల్యాబ్‌ను పరిశీలిస్తున్న మధుసూదన్‌రావు

అన్నదాతల్లో ఆందోళన


వర్షాలతో వరికి నష్టం

న్యూస్‌టుడే, ముమ్మిడివరం

నారుమళ్ల దగ్గర నుంచి పంట చేతికొచ్చే వరకు అన్నదాతకు ఆందోళన తప్పడం లేదు. ప్రస్తుతం బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు వరి చేలు ముంపు బారిన పడుతున్నాయి. ఈనిక, పొట్ట దశల్లో ఉన్న వరిచేలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. సోమవారం జిల్లాలో 51 మిల్లీ మీటర్లు సగటు వర్షపాతం నమోదైంది.



వరికంకులను కట్టలు కడుతున్న రైతు



చిరుపొట్ట, ఈనిక దశల్లో..

ఖరీఫ్ సాగులో వరిచేలు ప్రస్తుతం వివిధ దశల్లో ఉన్నాయి. అమలాపురం, కొత్తపేట డివిజన్‌లలో వరిచేలు ఈనిక, చిరుపొట్ట దశల్లో ఉండగా.. రామచంద్రపురం డివిజన్‌లో ఈనిక పూర్తయి.. గింజ పాలుపోసుకునే స్థితిలో ఉంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వరిచేలు ముంపునకు గురై ఈనిక, పొట్ట దశలో ఉన్న చేలల్లో నీరు నిలవడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నేలవాలితే గింజలు పూర్తిగా పాలుపోసుకుని గట్టిపడే అవకాశాలు ఉండవు. ఇది దిగుబడిపై ప్రభావం చూపుతుంది. మరో 30-45 రోజుల్లో పంట చేతికొచ్చే దశలో.. తుపాన్లు, భారీ వర్షాలు సంభవిస్తే దారుణంగా నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మురుగు కాలువలే అసలు సమస్య..

ముంపునీరు దిగడానికి మురుగు కాలువల వ్యవస్థ ఉన్నా.. అస్తవ్యస్తంగా మారింది. ముంపుబారిన పడిన వరిచేలల్లో నీరు దిగడానికి ఎక్కువ రోజులు పట్టడంతో పంటలకు నష్టం వాటిల్లుతోంది. గత అయిదేళ్లలో వైకాపా పాలకులు మురుగు కాలువల్లో ఎక్కడా తట్టమట్టి తీయలేదు. మరోవైపు ఆక్రమణల కారణంగా కాలువలు బక్కచిక్కిపోయాయి.

నీరుపోయే ఏర్పాట్లు చేయాలి..

చేలల్లో నీరు దిగువకు పోయే విధంగా చర్యలు చేపట్టాలి. మురుగు కాలువల ద్వారా వేగంగా నీరు దిగకపోవడంతో ముంపు సమస్య ఏర్పడి రైతులు ఇబ్బంది పడుతున్నారు. సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

-వి.బోసుబాబు, జిల్లా వ్యవసాయాధికారి

అధిక మోతాదులో ఎరువులు వాడొద్దు: డీఏవో

అంబాజీపేట, న్యూస్‌టుడే: వరిలో అధిక మోతాదులో రసాయన ఎరువులు వాడడం వల్ల తెగుళ్లబారిన పడతాయని జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు అన్నారు. మంగళవారం ముక్కామల రైతుసేవా కేంద్రం వద్ద పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నత్రజనిని తగ్గించి వాడాలన్నారు. పొటాష్‌ను దమ్ములోనూ, చిరుపొట్ట దశలోనూ వాడాలన్నారు. కముజువారిలంకలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ రాజశేఖర్ పాల్గొని పలు సూచనలు చేశారు. ఏడీఏ రాజమోహనరావు, ఏవో సీహెచ్‌డీ విజయ్‌కుమార్, సర్పంచి ఎస్.సుబ్రహ్మణ్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు అర్హత

రాజోలు, న్యూస్‌టుడే: రాజోలు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన అయిదుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయిని సరస్వతి మంగళవారం తెలిపారు. బట్టేలంక జడ్పీ ఉన్నత పాఠశాలలో అండర్-14, అండర్-17 స్థాయిల్లో ఈ ఎంపికలు జరిగాయన్నారు. జి.ప్రవీణ్‌కుమార్, ఎం.ప్రదీప్ శ్రీశివసాయి, జి.నిఖిల్, జి.నవీన్‌కుమార్, పి.ప్రసన్నకుమార్‌లు ఈ నెల 17 నుంచి 19 వరకు నంద్యాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ విద్యార్థులను ఎస్ఎంసీ ఛైర్మన్ ఏసుబాబు, ఉపాధ్యాయులు అభినందించారు.


ఎంపికైన రాజోలు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు

నీటిపైనే జీవనం.. బోటులోనే ఆవాసం..!

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. సముద్రంలో అలలు ఎగసి పడుతుండటంతో మత్స్యకారులు తమ బోట్లను అంతర్వేది హార్బర్‌కి చేర్చారు. హార్బర్‌లో సరైన సౌకర్యాలు లేకపోవడంతో నీటిపైనే జీవనం.. బోటుపైనే ఆవాసంగా తయారైందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేపల హాల్ భవనంలో వలలు, కుళ్లిన చేపలు గుట్టలుగా వేసి కనీసం విశ్రాంతి తీసుకోవడానికి వీలులేకుండా చేస్తున్నారని వాపోతున్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో వీటిని తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. మత్స్యకారులకు అనుకూలంగా భవనాన్ని ఏర్పాటు చేస్తామని రాజోలు మత్స్యశాఖ ఏడీ హర్షవర్ధన్ తెలిపారు.

- న్యూస్‌టుడే, సఖినేటిపల్లి



పాదగయలో పొట్టేల్ సినీ బృందం పూజలు

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురం పాదగయ క్షేత్రాన్ని పొట్టేల్ సినిమా యూనిట్ సభ్యులు మంగళవారం సందర్శించారు. ఆలయంలో కుక్కుటేశ్వరస్వామి, రాజరాజేశ్వరీ దేవి, పురుహూతిక అమ్మవారు, దత్తాత్రేయ స్వామివార్లను సినీ హీరో యువ, హీరోయిన్ అనన్య నాగళ్ల, నటుడు నోయల్, నిర్మాత నిషాంక్ దర్శించుకుని పూజలు చేశారు. వారికి ఆలయ అర్చకులు క్షేత్ర విశిష్టతను వివరించారు. ఆలయ అధికారులు పట్టువస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయానికి వచ్చిన చిత్ర బృందాన్ని చూసేందుకు జనం రావడంతో ఆలయం కిక్కిరిసింది. యువ, అనన్య మాట్లాడుతూ గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నియోజకవర్గంలో చిత్రం ప్రచార కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.


పాదగయ విశిష్టతను తెలుసుకుంటున్న సినీ నటులు యువ, అనన్య తదితరులు


మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు. చిత్రంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేష్, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ తదితరులు

పట్టభద్రుల ఎన్నికల్లో విజయఢంకా మోగిద్దాం

కూటమి నేతలు

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: త్వరలో జరగబోయే ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించే దిశగా కూటమి నాయకులంతా కృషిచేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం మంగళవారం రాజమహేంద్రవరంలో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. ప్రభుత్వం అధికారంలో లేనప్పుడే పట్టభద్రుల ఎన్నికల్లో విజయం సాధించామన్నారు. గత ప్రభుత్వం నిరుద్యోగ యువతను మోసం చేసిందన్నారు. ఈ ప్రభుత్వం అధికారం చేపట్టగానే మెగా డీఎస్సీ ప్రకటించిందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కంటే ముందు.. నమోదు ప్రక్రియకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

వైకాపా యువతను మోసం చేసింది..

రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ అంతా కలిసి కట్టుగా పనిచేస్తే వైకాపా పోటీ చేసే అవకాశం లేదన్నారు. అభ్యర్థి ఎవరైనా కూటమి గెలుపుకోసం పని చేయాలన్నారు. రాష్ట్ర జలవనరుల అభివృద్ధి శాఖ మంత్రి రామానాయుడు మాట్లాడుతూ రూ.14 లక్షల కోట్ల అప్పులతో ఉన్నప్పటికీ సంక్షేమ పాలన అందిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం యువతను నమ్మించి మోసం చేసిందన్నారు. కాకినాడ, ఏలూరు, రాజమహేంద్రవరంలో ఎక్కువ మంది పట్టభద్ర ఓటర్లుంటారు కనుక మరింత దృష్టి సారించాల్సి ఉందన్నారు. మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యేలు హరిప్రసాద్, చిర్రి బాలరాజు, మాజీ మంత్రులు సుజయ్ కృష్ణ రంగారావు, జవహర్, పితాని సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ రెడ్డి సుబ్రహ్మణ్యం, భాజపా జనరల్ సెక్రటరీ కాశీ విశ్వనాథ్ తదితరులు మాట్లాడారు. తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ త్వరలో ఎమ్మెల్సీ అభ్యర్థిని ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు జ్యోతుల నెహ్రూ, పంతం నానాజీ, బత్తుల బలరామకృష్ణ, బూరుగుపల్లి శేషారావు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తదితరులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన కూటమి నేతలు పాల్గొన్నారు.

పశు పోషకులకు ఆర్థిక భరోసా

కిసాన్ క్రెడిట్ కార్డు పథకంలో రుణాలు

న్యూస్‌టుడే - ఆలమూరు, రావులపాలెం పట్టణం

వ్యవసాయంతో పాటు పశుపోషణపై ఆధారపడి జీవించే కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరోసా కల్పిస్తున్నాయి. ఇందుకు (పీకేసీసీ) పశు కిసాన్ క్రెడిట్ కార్డు పథకాన్ని తీసుకొచ్చాయి. పశువుల మేత, దాణా, వైద్యం కోసం పశు పోషకుల చేతిలో డబ్బులు లేకుంటే ఎక్కువ వడ్డీకి ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించవలసి ఉంటుంది. దీనికి చెక్ పెట్టేందుకు బ్యాంకుల నుంచి రుణం పొందడానికి అవకాశం కల్పిస్తున్నాయి. జిల్లాలో 8,500 మందికి కార్డులు అందజేయాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు పశుసంవర్ధక శాఖ అధికారులు తెలిపారు. అర్హులైన వారు గ్రామ పశు సంవర్ధక సహాయకులు, పశువైద్య సిబ్బంది ద్వారా దరఖాస్తులు పూర్తి చేయాలి.

రూ.3 లక్షల వరకు రుణ సౌకర్యం

ఈ కార్డుతో గరిష్ఠంగా పశువుల సంఖ్యను బట్టి రూ.3 లక్షల వరకు రుణం మంజూరు చేస్తారు. రూ.1.60 లక్షల వరకు ఎలాంటి పూచీకత్తు ఉండదు. ఈ రుణాన్ని 40 రోజుల లోపు తిరిగి చెల్లిస్తే 7 శాతం వడ్డీ వసూలు చేస్తారు. ఏడాదిలోపు క్రమం తప్పకుండా చెల్లిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో మూడు శాతం చొప్పున వడ్డీ రాయితీ ఇస్తాయి. మిగిలిన ఒక శాతం మాత్రం రైతులు చెల్లిస్తే సరిపోతుంది. ఎటువంటి రాజకీయ సిఫార్సులు అవసరం లేకుండా బ్యాంకు అధికారులే ఈ రుణాలు మంజూరు చేస్తారు.


ఆలమూరులో పశువుల శాల

జిల్లా వివరాలు ఇలా..

ఆవులు	65,000
గేదెలు	1,75,000
గొర్రెలు	29,000
మేకలు	21,000

సద్వినియోగం చేసుకోవాలి



పశు పోషకులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఇప్పటి వరకు 1,448 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశంతో ప్రైవేటు వడ్డీ వ్యాపారుల బెడద తగ్గుతుంది. జిల్లాలో ప్రభుత్వం కేటాయించిన లక్ష్యాన్ని పూర్తి చేయడానికి కృషి చేస్తున్నాం. ఇంకా అర్హులైనవారు ఉంటే దరఖాస్తు చేసుకోవచ్చు.

- డా.కొమ్మా వెంకట్రావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి

నన్నయలో పీజీ కోర్సులకు 17న తక్షణ ప్రవేశాలు

నన్నయ విశ్వవిద్యాలయం (రాజానగరం), న్యూస్‌టుడే: నన్నయ విశ్వవిద్యాలయం 2024 - 25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీ, ఎమ్మెస్సీ కోర్సుల్లోని భర్తీ చేయని సీట్లకు ఈనెల 17వ తేదీన స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏపీ పీజీసెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు మాత్రమే స్పాట్ కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం ప్రధాన ప్రాంగణం, కాకినాడ, తాడేపల్లిగూడెం ప్రాంగణాలలో సంబంధిత సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. విశ్వవిద్యాలయంలోని డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహిస్తారని చెప్పారు. అభ్యర్థులు 17వ తేదీ ఉదయం 9.30 నిమిషాల నుంచి 11 గంటల లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కౌన్సెలింగ్ ప్రక్రియను డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఆచార్య డి.జ్యోతిర్మయి పర్యవేక్షిస్తారన్నారు. సీట్లు, ఫీజు వివరాలను విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చన్నారు.

నాయీ బ్రాహ్మణులకు రూ.800 కోట్లు కేటాయించాలి

కాకినాడ కలెక్టరేట్: ఉమ్మడి జిల్లాలోని నాయీబ్రాహ్మణ సంఘాల ప్రతినిధులతో బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.శ్రీనివాసరావు మంగళవారం కాకినాడలోని కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. వారికి అవసరమైన నిధులు, సదుపాయాలు, అవకాశాలపై చర్చించారు. ఆ సంఘాల ప్రతినిధులు ఆయనకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నాయీబ్రాహ్మణుల అభ్యున్నతికి రూ.800కోట్లు కేటాయించాలని కోరారు. గ్రేడ్-1 దేవాలయాలకు ఛైర్మన్లుగా, మండల పరిషత్తు, జిల్లా పరిషత్తు, పట్టణ స్థానిక సంస్థల్లో కో-ఆప్షన్ సభ్యులుగా నియమించాలని కోరారు. స్వయం ప్రతిపత్తి ఉన్న దేవాలయాల్లో డైరెక్టర్ పదవులు ఇవ్వాలని, వాయిద్య కళాకారులకు 50 ఏళ్లకే పింఛను సదుపాయం కల్పించాలని కోరారు. సంఘాల ప్రతినిధులు సుందరపల్లి గోపాలకృష్ణ, దాస్యం ప్రసాద్, చొప్పెల్ల శ్రీనివాస్, మానుకొండ దుర్గాప్రసాద్, ఎం.నాగసత్యనారాయణ, కె.సూరిబాబు, ర్యాలి లోవరాజు, సీహెచ్.శివప్రసాద్, వేపాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


ఈడీ శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇస్తున్న ప్రతినిధులు

ఉపాధ్యాయుల పీఎఫ్ సమస్యల పరిష్కారానికి వినతి

సాంబమూర్తినగర్, కాకినాడ నగరం: ఉపాధ్యాయుల పీఎఫ్ సంబంధిత సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) జిల్లా పరిషత్తు సీఈవోకు విన్నవించింది. మంగళవారం జడ్పీ కార్యాలయంలో సీఈవో వీవీఎస్ లక్ష్మణరావును ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మోర్త శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కాశీ విశ్వనాథ్ తదితరులు కలిశారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి పీఎఫ్ స్లిప్పులను అందుబాటులో ఉంచాలని కోరారు. 2022 జనవరి, ఫిబ్రవరిల పీఎఫ్ సబ్‌స్క్రిప్షన్లను వారి ఖాతాలో నమోదు చేయాలన్నారు. విశ్రాంత ఉపాధ్యాయుల పీఎఫ్ చెల్లించిన తర్వాత జమైన 2022 జనవరి, ఫిబ్రవరిల పీఎఫ్, డీఏల బకాయిలు తిరిగి చెల్లించాలన్నారు. పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సీఈవోకు ఇచ్చారు. నాయకులు యు.శ్రీను, పి.సుబ్బరాజు, టి.సంపత్‌కుమార్, పోతు రామకృష్ణ, కేవీ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.


సీఈవో లక్ష్మణరావుకు వినతిపత్రం అందించిన ఎస్టీయూ నాయకులు

ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ క్రీడా ఎంపికలు

మసీదుసెంటర్ (కాకినాడ): ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పలు క్రీడల్లో ఎంపికలు నిర్వహించినట్లు ఎస్‌జీఎఫ్ అండర్-14, 17 జిల్లా కార్యదర్శి లంక జార్జి మంగళవారం తెలిపారు. వాలీబాల్ అండర్-17 బాలురు, సాఫ్ట్ టెన్నిస్ అండర్-14, 17 బాలబాలికలకు, మార్షల్ ఆర్ట్స్ అండర్-14, 17 బాలబాలికల ఎంపికలు జరిగాయన్నారు. సుమారు 600 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. కాకినాడ జిల్లా పీఈటీ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు వి.రవిరాజు, నూకరాజు, కోశాధికారి రవి సుందర్ కౌర్, ఎస్‌జీఎఫ్ అసిస్టెంట్ కార్యదర్శులు సునీల్, కె.పరుశురాం, పీడీలు తదితరులు పాల్గొన్నారు.


వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలని డిమాండ్

గాంధీనగర్: సహకార బ్యాంకు సీఈవో ఇచ్చిన ఉత్తర్వులు తక్షణమే ఉపసంహరించుకోవాలని, లేదంటే సమ్మెకు దిగుతామని ఏపీ స్టేట్ అగ్రికల్చర్ కోఆపరేటివ్ సొసైటీ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ అనుబంధ) నాయకులు హెచ్చరించారు. ఉమ్మడి జిల్లా సంఘ సమావేశం కాకినాడ పరిధిలోని సహకార రంగ ఉద్యోగుల భవనంలో మంగళవారం జరిగింది. ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షుడు తోట వెంకటరామయ్య, రాష్ట్ర కోశాధికారి పి.సత్యనారాయణలు హాజరై మాట్లాడారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సీఈవో ఈనెల 7న ఇచ్చిన ఉత్తర్వులో 2019 తర్వాత సహకార ఉద్యోగులుగా నియమించిన వారిని, 60 ఏళ్లు పూర్తయిన వారిని తొలగించాలని పేర్కొన్నారన్నారు. కోర్టు అనుమతిలేని వారు పొందిన జీతాలు తిరిగి చెల్లించాలన్నారు. వాటిని ఉపసంహరించుకోవాలన్నారు. బుధవారం నుంచి నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరుకావాలన్నారు. ఆన్‌లైన్, జూమ్, దూరదృశ్య సమావేశాలను బహిష్కరిస్తున్నామన్నారు. 21న కాకినాడ డీసీసీబీ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలన్నారు. సీఐటీయూ కోనసీమ జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరాం మాట్లాడుతూ నిబంధనల మేరకే 2019లో నియామకాలు జరిగాయన్నారు. అయిదేళ్ల సర్వీసు తర్వాత వారిని తొలగించడం చట్ట వ్యతిరేకమన్నారు. సహకార ఉద్యోగులు చేసే పోరాటాలకు సీఐటీయూ మద్దతు ఉంటుందన్నారు. కాకినాడ జిల్లా అధ్యక్షుడు కె.ఆదినారాయణమూర్తి అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. సీఐటీయూ కోనసీమ జిల్లా అధ్యక్షుడు రామచంద్రరావు, తూగో.జిల్లా అధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ, నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఐటీయూ ప్రధాన కార్యదర్శి బలరాం

బాలుడి మృతిపై అనుమానాలున్నాయ్..

సర్పవరం జంక్షన్, న్యూస్‌టుడే: 'మా బిడ్డ మృతిపై అనుమానాలున్నాయ్. పోలీసులు సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి'అని మంగళవారం బాలుడి తల్లిదండ్రులు, బంధువులు కాకినాడ పరిధి నాగమల్లితోటలోని రాజేశ్వరి రెసిడెన్సీ అపార్టుమెంట్ ఆవరణలో మృతదేహంతో ఆందోళన చేశారు. సోమవారం అపార్టుమెంట్‌పైనుంచి విద్యార్థి కుక్కల చరణ్‌శ్రీతేజ(13) అనుమానాస్పద స్థితిలో మృతిచెందడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాకినాడ జీజీహెచ్‌లో పోస్టుమార్టం పూర్తయ్యాక నేరుగా అపార్టుమెంట్ ఆవరణలో మృతదేహంతో నిరసనకు దిగారు. మృతికి కారణాలు తెలపాలని, పోలీసులు సమగ్ర విచారణ నిర్వహించాలని డిమాండ్ చేశారు. బాలుడి చిన్నాన్న వీరాంజనేయులు మాట్లాడుతూ బయటకు వెళ్తున్న చరణ్‌శ్రీతేజ ఎవరో పిలవడంతోనే అపార్టుమెంటుపైకి వెళ్లాడన్నారు. తర్వాత పైనుంచి పడి చనిపోయాడని పేర్కొన్నారు. ఇప్పటివరకు అపార్టుమెంట్ అసోసియేషన్‌వారు వచ్చి కనీసం బాధిత తల్లిదండ్రులను పలకరించలేదని, చంపేసి పడేశారనే అనుమానం తమకు ఉందని అన్నారు. తమ దర్యాప్తులో దోషులెవరో తేలితే కేసు నమోదుతో కఠిన చర్యలు తీసుకుంటామని సర్పవరం సీఐ పెద్దిరాజు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అంత్యక్రియలకు మృతదేహాన్ని తీసుకువెళ్లారు.


అపార్ట్‌మెంట్ వద్ద బైఠాయించిన చరణ్‌శ్రీతేజ బంధువులు

త్రుటిలో తప్పిన ప్రమాదం

పామర్రు: కె.గంగవరం మండలం యర్రపోతవరం వద్ద ఒక ప్రైవేటు ట్రావెల్ బస్సు అదుపుతప్పి కాలువలోకి దూసుకుపోబోయి చెట్టును ఢీకొని క్షణకాలంలో ఆగింది. లేకుంటే బస్సులో ప్రయాణిస్తున్న 26 మంది పరిస్థితి ప్రశ్నార్థకంగా మారి ఉండేది. త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పింది. స్థానికులు చెప్పిన వివరాల ప్రకారం... ద్వారకాతిరుమల నుంచి యానాం వైపు వెళ్తున్న యాత్ర బస్సు మంగళవారం ఉదయం యర్రపోతవరం వంతెనవద్దకు వచ్చేసరికి అదుపుతప్పి కాలువ వైపుగా దూసుకుపోయింది. అక్కడ పెద్ద చెట్టు ఉండటంతో దానిని ఢీకొని ఆగింది. వాహనచోదకుడు, ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. కాసేపటి తరువాత బస్సును వెనక్కి తీసుకొని ప్రయాణికులతో యానాంకు వెళ్లింది. ఈ విషయమై కె.గంగవరం ఎస్సై షేక్‌జానీబాషాను వివరణ కోరగా పెద్ద ప్రమాదం తప్పిందని ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగనందున ఫిర్యాదు ఏమీ రాలేదన్నారు.


యర్రపోతవరం వద్ద కాలువ గట్టున చెట్టును ఢీకొట్టి ఆగిన బస్సు

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	11,500
పాతకాయ: గండేరా	17,500
గటగట	15,500
కొత్తకాయ: గండేరా	16,500
గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	14,000-15,000
కొత్త (పచ్చి) కాయ	13,500-14,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,750
కిలో	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	135-00
రిటైల్ లైవ్	157-00
డ్రెస్డ్	228-00
స్కిన్‌లెస్	259-00

ద్విచక్ర వాహనం దొంగిలించిన వ్యక్తి అరెస్టు

గండేపల్లి(జగ్గంపేట): ద్విచక్ర వాహనాన్ని దొంగిలించిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు జగ్గంపేట ఎస్సై రఘునాథరావు తెలిపారు. వివరాలివీ.. ఆత్రేయపురం మండలం వెలిచేరు గ్రామానికి చెందిన తుపాకుల రామదాసు అనే వ్యక్తి సోమవారం జగ్గంపేటలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ద్విచక్ర వాహనాన్ని దొంగిలించుకుపోయాడు. దీనిపై ద్విచక్ర వాహనదారుడు ఇచ్చిన ఫిర్యాదుపై దర్యాప్తులో భాగంగా మంగళవారం ఉదయం గోకవరం రోడ్డులో వాహనాన్ని దొంగిలించిన వ్యక్తిని పట్టుకుని కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. దొంగను వెంటనే పట్టుకున్న ఎస్సైను సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ అభినందించారు.

యువకుడిపై పోక్సో కేసు

కొత్తపేట న్యూస్‌టుడే: ప్రేమ పేరుతో బాలికను మోసం చేసిన యువకుడిపై కొత్తపేట పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి వారు తెలిపిన వివరాలిలా.. కొత్తపేట మండలానికి చెందిన వరసాల కృష్ణబాబు(22) కొబ్బరికాయల వ్యాపారం చేస్తుంటాడు. అదే మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(17)తో అతనికి పరిచయం ఏర్పడింది. ప్రేమ పేరుతో ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని బాలిక కుటుంబ సభ్యులకు చెప్పడంతో పోలీసులను ఆశ్రయించారు. జరిగిన సంఘటనపై డీఎస్పీ వై.గోవిందరావు విచారణ జరిపి యువకుడిని అరెస్టు చేసి మంగళవారం కోర్టులో హాజరుపరచగా 15 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు.

తాగునీటి వృథా..



కత్తిమండ-చీమేనిరవ సరిహద్దులో వీధి కొళాయి నుంచి గత కొన్ని రోజులుగా తాగు నీరు లీకై వృథాగా పోతోంది. దీన్ని అరికట్టడా నికి స్థానికులు కొళాయికి కర్రను అమర్చారు. అధికారులు స్పందించి శాశ్వత నివారణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, మలికిపురం

రాజోలు

• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

ఆర్థిక సాయం అందజేత

రాజోలు: రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని పలువురు పేద విద్యార్థినులకు అమలాపురానికి చెందిన కడలి సేవా ట్రస్ట్ ఫౌండర్ అండ్ ఛైర్మన్, విశ్రాంత సీబీసీఐడీ అధికారి కడలి సత్యనారాయణ రూ.50 వేల ఆర్థికసాయాన్ని మంగళవారం అందజేశారు. కళాశాల రుసుముల నిమిత్తం మొత్తం పది మందికి ఈ మొత్తాన్ని అందించారు. ప్రిన్సిపల్ పి.సాయిబాబు పాల్గొన్నారు.

అరుణాచల గిరి ప్రదక్షిణకు బస్సు

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: రావులపాలెం ఆర్టీసీ డిపో నుంచి అరుణాచల గిరి ప్రదక్షిణకు సూపర్‌లగ్జరీ బస్సు నడుపుతున్నట్లు డిపో మేనేజరు కుమార్ తెలిపారు. నవంబరు 14న రావులపాలెం బస్టాండ్ నుంచి బస్సు బయలుదేరుతుందని, పలు దేవాలయాలను సందర్శించుకుని 19న తిరిగి వస్తుందన్నారు. ఒక్కొక్క టికెట్ ధర రూ.4 వేలుగా నిర్ణయించామన్నారు.

రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా సుజాత

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: రావులపాలెం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పి.సూర్యకాంతం(సుజాత) నియమితులయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా కొత్తపేట ఆర్డీవో కార్యాలయంలో పనిచేస్తున్న ఈమెను ఉన్నతాధికారులు రావులపాలెం తహసీల్దార్ కార్యాలయానికి బదిలీ చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సత్వరమే పరిష్కరించే విధంగా పనిచేస్తానన్నారు.

కుమ్మరి శాలివాహన సంఘం సమావేశం

అంబాజీపేట, న్యూస్‌టుడే: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కుమ్మరి శాలివాహన సంఘ సమావేశం మండలంలోని మాచవరంలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా కార్తిక వనసమారాధన కార్యక్రమాన్ని నవంబరు 17న మాచవరంలోని సంఘ భవనంలో జరపడానికి నిర్ణయించారు. జిల్లా సంఘ ప్రముఖులు మానేపల్లి వీరబ్రహ్మం, దాలిపర్తి భీమేశ్వరరావు, ఆదుర్తి నారాయణరావు, మండల సంఘ అధ్యక్షులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

వీధి దీపాలకు మరమ్మతులు

స్పందనకు స్పందన

రావులపాలెం ఊబలంక రోడ్డులో వీధి దీపాలు వెలగకపోవడం వల్ల చీకటి రాజ్యమేలుతోంది. దీని వల్ల రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి ఎస్.దుర్గాప్రసాద్ దృష్టికి తీసుకుని వెళ్లడంతో సిబ్బందిని పంపి మరమ్మతులు చేయించారు.

రాజవరం గ్రామంలో..

రాజవరం గ్రామంలో వీధి దీపాలు వెలగక ఇబ్బందులు పడుతున్నామంటూ గ్రామస్థులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తెచ్చారు. ఈ విషయాన్ని సర్పంచి జాన మంగయమ్మ దృష్టికి తీసుకెళ్లగా స్పందించి వీధి దీపాలు వేయించారు.

– న్యూస్‌టుడే, ఆత్రేయపురం, రావులపాలెం పట్టణం

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:

రాజోలు : 80085 74174

పి.గన్నవరం : 80085 74229

కొత్తపేట : 90323 93884

కూలేలా ఉన్నాయ్.. కొత్తరూపు వచ్చేనా!

కూలేందుకు సిద్ధంగా ఉన్న ప్రభుత్వ వసతిగృహాలకు కొత్తరూపు తెచ్చేలా కూటమి ప్రభుత్వం 'పీఎం అజయ్' పథకం ద్వారా నిధుల మంజూరుకు కేంద్రానికి నివేదించింది. అన్ని సౌకర్యాలతో ఒక్కో భవనానికి రూ.3 కోట్లతో ఆధునికీకరణ పనులు చేపట్టాలని యోచిస్తోంది. రాజోలు నియోజకవర్గంలో పలుచోట్ల వసతిగృహాలు అధ్వానంగా మారినా, సరైన వసతులు లేక విద్యార్థులు అవస్థలు పడినా గత వైకాపా ప్రభుత్వం అయిదేళ్ల కాలంలో పట్టించుకున్న పాపాన పోలేదు. ఆ పరిస్థితిని ప్రస్తుత కూటమి ప్రభుత్వం చక్కదిద్దడానికి చేస్తున్న ప్రయత్నాలతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

– న్యూస్‌టుడే, మామిడికుదురు, రాజోలు



రాజోలులో శిథిల స్థితికి చేరిన బాలుర వసతిగృహం



సమీకృత బాలికల వసతిగృహంలో దెబ్బతిన్న వరండా

అడుగు పెట్టాలంటే అవస్థలే..

రాజోలు సమీకృత బాలికల వసతిగృహంలో అడుగు పెట్టాలంటేనే విద్యార్థినులు బెంబేలెత్తిపోతున్నారు. 300 మంది ఉండాల్సి ఉన్నా ప్రస్తుతం 140 మంది మాత్రమే ఉన్నారు. 8 గదులకు గాను నాలుగు గదుల్లోకి వెళ్లలేక వాటిని అలా వదిలేశారు. రెండు గదుల్లో చప్టాలు దెబ్బతిన్నాయి. 9 మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరి నిరుపయోగమయ్యాయి. స్నానాల గదుల దుస్థితి ఇలానే ఉంది.

రాజోలులో 57 మంది విద్యార్థులున్న సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహ భవనం శిథిలావస్థకు చేరింది. 1983లో నిర్మితమైన ఈ భవనంలోని ఆరు గదులు, వరండాలోనూ స్లాబు పెచ్చులు రాలిపడుతున్నాయి. చుట్టూ గోడలు పలుచోట్ల నెర్రలు తీశాయి. వర్షం కురిస్తే పుస్తకాలు, దుస్తులు తడిసిపోతున్నాయి. వంటగది, మరుగుదొడ్ల అధ్వానంగా మారడంతో అవస్థలు పడుతున్నారు. ఎన్నో సమస్యలకు నిలయంగా ఉంది. కొత్త భవనాన్ని నిర్మించే లోగా దీనిని వేరేచోటుకు మార్చు చేయాలన్న ప్రతిపాదన కూడా అమలుకు నోచుకోలేదు.

సౌకర్యాలు కరవై..

మామిడికుదురులో 38 ఏళ్ల క్రితం నిర్మించిన బాలికల వసతిగృహంలో స్లాబు నుంచి వర్షంనీరు లీకవుతోంది. కిటికీలకున్న దోమతెరలు దెబ్బతిన్నా చక్కదిద్దే చర్యలు కరవయ్యాయి. సంక్షేమాధికారిణి నివాసం ఉండే భవనం స్లాబు దెబ్బతినడంతో నిరుపయోగంగా మారింది. బాలుర వసతిగృహంలోనూ గుమ్మాలు, కిటికీలు ఛిద్రమైనా చర్యలు కనిపించడం లేదు. మలికిపురం మండలం కేశనపల్లిలోని బాలుర వసతిగృహం స్లాబు దెబ్బతినడంతో పెచ్చులు రాలిపడుతున్నాయి.

ప్రతిపాదనలు పంపాం..

వసతిగృహాల ఆధునికీకరణ, మరమ్మతులకు అవసరమైన ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే పనులు జరుగుతాయి. రాజోలు బాలుర వసతిగృహం పరిస్థితిని ఉన్నతాధికారులకు నివేదించాం. కొత్తభవనం నిర్మించే లోగా వేరేచోటుకు తాత్కాలికంగా మార్పు చేసేందుకు సన్నద్ధమవుతున్నాం.

– వెంకటేశ్వరరావు, సహాయ సాంఘిక సంక్షేమాధికారి

కలాం సేవలు స్ఫూర్తిదాయకం

మామిడికుదురు, రాజోలు, పి.గన్నవరం, రావులపాలెం (గ్రామీణం), న్యూస్‌టుడే: మాజీ రాష్ట్రపతి దివంగత ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి సందర్భంగా మామిడికుదురు మండలం ఈదరాడ జడ్పీ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులు మంగళవారం చిత్రించిన ఆయన బొమ్మలను గీసి ప్రదర్శించారు. ప్రధానోపాధ్యాయుడు సాయిబాబా అభినందించారు. ✦ రాజోలు మండల పరిషత్ కార్యాలయంలో కలాం చిత్రపటానికి ఎంపీడీవో కేత శ్రీనివాస్ పూలమాల వేసి నివాళి అర్పించారు. ఉప ఎంపీపీ ఆనందరాజు, ఈవోపీఆర్డీ భీమారావు, ఏవో మామిడిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ✦ పి.గన్నవరం సామాజిక ఆసుపత్రిలో జరిగిన కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ రామచంద్ర, అబ్దుల్‌కలాం ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ భీమాల వెంకటేశ్వరరావు నివాళులర్పించారు. రోగులకు పండ్లు, రొట్టెలు అందించారు. ✦ రావులపాలెం మండలం వెదిరేశ్వరం ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఈశ్వరరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం, ఎంఈవో శ్రీనివాస్‌రాజు, పాఠశాల ఛైర్మన్ సుబ్బయమ్మ తదితరులు హాజరై కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



పెన్సిల్‌తో విద్యార్థినులు గీసిన కలాం చిత్రాలు



మలికిపురం: గుబ్బలవారి గ్రూపులో ఎమ్మెల్యే దేవ భూమిపూజ



కట్టుంగలో ఎమ్మెల్యే బండారు శిలాఫలకం ఆవిష్కరణ



సత్యవతి కాలనీలో ఎమ్మెల్యే సత్యనారాయణకు సమస్యలపై మొర

గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలు: ఎమ్మెల్యే బండారు

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మంగళవారం పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా ఆత్రేయపురం, ఉచ్చిలి, తాడిపూడి, కట్టుంగ గ్రామాల్లో రూ.1.17 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకొన్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ముదునూరి వెంకటరాజు, సర్పంచి గెడ్డం సుధ, నాయకులు పాల్గొన్నారు.

మలికిపురం: ప్రజాభీష్టం మేరకే గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తున్నట్లు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మలికిపురం గుబ్బలవారి గ్రూపు, కత్తిమండ, లక్కవరం, రామరాజులంక, దిండి గ్రామ పంచాయతీల పరిధిలో మంగళవారం పలు సీసీ రహదారుల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఎంపీపీ మేడిచర్ల వెంకటసత్యవాణి, మార్కెట్‌ఫెడ్ డైరెక్టరు గుండుబోగుల నరసింహారావు, సర్పంచులు గెడ్డం రాజ్యలక్ష్మి, ఆరేటి రంగ నాయకులు, కోట పుష్పకుమారి, ముదునూరి శ్రీనివాసరాజు, కె.శ్రీనివాస్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సమస్యలపై మహిళల వినతి..

అంబాజీపేట: లోవోల్టేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్నామని.. సీసీ రహదారి నిర్మాణానికి భూమిపూజ చేయడానికి వచ్చిన పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణకు సత్యవతి కాలనీ మహిళలు మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధిపై దృష్టి పెట్టామన్నారు. వాకాలగరువు, తొండవరం, కె.పెదపూడి, చిరతపూడి, ఇసుకపూడి గ్రామాల్లో రూ.1.57 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు మంజూరయ్యాయని చెప్పారు. సర్పంచులు నాగాబత్తుల శాంతకుమారి, పేరాబత్తుల దొరబాబు, మద్దింశెట్టి దొరబాబు, ఎంపీటీసీ వాకపల్లి దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు పుస్తకాల అందజేత

పి.గన్నవరం, న్యూస్‌టుడే: తెలుగులో రాయడం, చదవడంలో వెనుకబడిన విద్యార్థుల కోసం విశ్రాంత తెలుగుపండిట్ పి.వరహాలు సొంతంగా రాసిన 'తెలుగు భాషాశాలు-వ్యాకరణాంశాలు' పుస్తకాలను మంగళవారం పి.గన్నవరం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిది, పదోతరగతి విద్యార్థులకు అందించారు. ఈయన పి.గన్నవరం, లంకలగన్నవరం, నాగుల్లంక, అంబాజీపేట జడ్పీ ఉన్నత పాఠశాలల్లో పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. ఆయా పాఠశాలలకు చెందిన సుమారు 500 మంది విద్యార్థులకు వీటిని అందించనున్నారు. ప్రధానోపాధ్యాయుడు డి.యస్.వి.ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొనసాగిన అధ్యాపకుల నిరసన

మలికిపురం, న్యూస్‌టుడే: జీతాల కోసం గత 35 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న స్థానిక ఎంవీఎన్ జేఎస్ అండ్ ఆర్‌వీఆర్ డిగ్రీ కళాశాల అధ్యాపకులు మంగళవారం కూడా కొనసాగించారు. కళాశాల కార్యాలయం ఎదుట బైఠాయించి కరస్పాండెంట్ మంగెన వెంకటసత్యనారాయణమూర్తికి నిరసన తెలిపారు. జీతాలు ఇవ్వాలి.. మా ఆకలి తీర్చాలి అంటూ నినాదాలు చేశారు. తమ సమస్యలపై స్పందించాలని డిమాండు చేశారు.

నిధుల కేటాయింపు తీరుపై నాయకుల వాగ్వాదం

అంబాజీపేట, న్యూస్‌టుడే: పల్లె పండగ కార్యక్రమంలో అభివృద్ధి పనులకు నిధుల పంపకాలపై కూటమి నాయకుల్లో కుమ్ములాటలు చోటుచేసుకున్నాయి. మాచవరంలో మంగళవారం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడానికి వచ్చిన ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సమక్షంలోనే వాగ్వాదానికి దిగారు. మాచవరం పంచాయతీకి రూ.49 లక్షలు కేటాయించారు. ఈ నిధుల కేటాయింపులో పక్షపాతం చూపుతున్నారంటూ జనసేన పార్టీకి చెందిన కొర్లపాటి గోపి సర్పంచి నాగాబత్తుల శాంతకుమారి భర్త సుబ్బారావును నిలదీశారు. దీంతో ఆ పార్టీకి చెందిన మరో నాయకుడు మైపాల తాతాజీ కలుగజేసుకుని ఇదికూడా మాచవరం పంచాయతీ పరిధిలోకే వస్తుందని, దీంట్లో పక్షపాతం ఏమీలేదని బదులిచ్చారు. ఇరువర్గాల మధ్య ఎటువంటి ఘర్షణ చోటుచేసుకోకుండా ఎమ్మెల్యే సర్దుబాటు చేశారు.

ప్రొటోకాల్ విస్మరణపై రభస

అంబాజీపేట, న్యూస్‌టుడే: పల్లె పండగ శంకుస్థాపన కార్యక్రమాల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యుల చిత్రాలు ముద్రించకుండా తమను అవమానించారని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు ఎంపీడీవో సరోవర్‌పై మండిపడ్డారు. అంబాజీపేట కొర్లపాటివారిపాలెంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో భాగంగా రోడ్డు శంకుస్థాపన సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో తమ ఇద్దరి చిత్రాలు లేకపోవడాన్ని గుర్తించి ఎంపీపీ అసహనం వ్యక్తం చేశారు. దీనిపై ఎంపీడీవో వివరణ ఇస్తూ భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు వహిస్తామని చెప్పారు.

విభాగానిని ఢీకొట్టిన లారీ

రాజోలు, న్యూస్‌టుడే: పాలకొల్లు నుంచి కాకినాడ వెళ్తున్న ఊకలారీ సోమవారం అర్ధరాత్రి తాటిపాక కూడలిలో విభాగినిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ అడుగు భాగం ధ్వంసమైంది. విభాగిని వద్ద ఎటువంటి సూచికలు లేకపోవడంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు పేర్కొన్నారు. ఇటీవల కాలంలో ఇది రెండవ ప్రమాదం. ఈ కూడలిలో హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

అరటి గెలల చోరీతో ఆందోళన

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: అరటి తోటల్లో గెలలు చోరీకి గురవ్వడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల ఉచ్చిలి, వద్దిపర్రు, వెలిచేరు, ఆత్రేయపురం, పులిదిండి తదితర గ్రామాల్లో రాత్రిళ్లు గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి పక్వానికి వచ్చి గెలలు తస్కరిస్తున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టిన పంట ఇలా పరుల పాలవ్వడంతో జీర్ణించుకోలేకపోతున్నారు. పోలీసులు నివారణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వర్షం.. తప్పని అవస్థలు

మామిడికుదురు, రాజోలు, అయినవిల్లి, అంబాజీపేట, న్యూస్‌టుడే: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు లోతట్టు, శివార్లలో ఉన్న ఇళ్లచుట్టూ ముంపునీరు నిలిచిపోవడంతో అక్కడి కుటుంబాలకు అవస్థలు తప్పడంలేదు. మామిడికుదురు మండలం ఈదరాడ, మొగలికుదురు, బి.దొడ్డవరం, పాశర్లపూడి పరిధిలోని సత్రంతోటలో వర్షంనీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఆదుర్రులో బొంతు లక్ష్మీనారాయణకు చెందిన పూరిల్లు మంగళవారం తెల్లవారుజామున కూలిపోయింది. లూటుకుర్రు, పెదపట్నం, మగటపల్లి, మోరిపోలంలో రహదారుల గుంతల్లో నీరు నిలిచిపోయింది. ✦ రాజోలు మండలం సోంపల్లి గ్రామ పల్లిపాలెంలో చింతచెట్టు కూలడంతో ఓ ఇల్లు ధ్వంసమైంది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఈ ప్రమాదం చోటు చేసుకుందని ఇంటి యజమాని పొన్నమండ సత్యనారాయణ తెలిపారు. పైకప్పు, గోడలు పూర్తిగా పాడయ్యాయన్నారు. సంఘటనా స్థలాన్ని ఉప ఎంపీపీ పోలమూరి శ్యాంబాబు, వీఆర్వో తరుణ్‌రాజ్, కార్యదర్శి గణపతి పరిశీలించారు. ✦ అయినవిల్లి మండలంలోని లోతట్టు కాలనీ వాసులు ఇక్కట్లు పడుతున్నారు. అయినవిల్లి, తొత్తరమూడి, వెలువలపల్లి తదితర గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు వర్షాల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారుల గుంతల్లో నీరు నిలిచిపోయి వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. ✦ అంబాజీపేట మండలంలో పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. కొర్లపాటివారిపాలెంలోని గృహనిర్మాణశాఖ కార్యాలయం, రైతు సేవా కేంద్రాల వద్ద నీరు నిలిచిపోయింది.



ఆదుర్రులో కూలిన పూరింటి వద్ద బాధితుడు



సోంపల్లిలో ఇంటిపై కూలిన చెట్టు

యంత్రాంగం అప్రమత్తం

కొత్తపేట న్యూస్‌టుడే: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో కొత్తపేట రెవెన్యూ డివిజనల్ కార్యాలయం, అన్ని తహసీల్దారు కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి ఎవరికి ఏ సమస్య వచ్చినా నేరుగా తెలియజేయాలని ఆర్డీఓ పి.శ్రీకర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

కార్యాలయం	కంట్రోల్ రూమ్ నంబరు
కొత్తపేట రెవెన్యూ డివిజనల్ కార్యాలయం	08855 244299
అయినవిల్లి తహసీల్దారు కార్యాలయం	9491575700
ఆలమూరు	8639507819
అంబాజీపేట	8142434999
ఆత్రేయపురం	8008803202
కొత్తపేట	9059461848
పి.గన్నవరం	9010143248
రావులపాలెం	7780652319



కలశ పూజలో పాల్గొన్న భక్తులు



మానేపల్లిలో శక్తివేషధారణలు

కొత్తపేటలో పడిపూజ

కొత్తపేట న్యూస్‌టుడే: కొత్తపేట బోడిపాలెం వంతెన వద్ద గల గౌతమి అయ్యప్పస్వామి దేవాలయంలో 54 కలశాలతో అభిషేకం, పడిపూజ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. మంగళవారం సాయంత్రం అయ్యప్ప స్వాములు, భక్తులు అంతాకలిసి భజనలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

దుర్గాదేవి గ్రామోత్సవం

పి.గన్నవరం: మానేపల్లిలో మంగళవారం దుర్గాదేవి అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా సాగింది. ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలు ఆకట్టుకున్నాయి. ఉత్సవమూర్తిని వాహనంలో ఉంచి కోలాటం, శక్తివేషాలు, డప్పు వాయిద్యాలతో గ్రామంలో ఊరేగించారు.

మద్యం దుకాణాలు వద్దంటూ తీర్మానం

ఆలమూరు, న్యూస్‌టుడే: కొత్తూరు వెదురుమూడి రహదారిని ఆనుకుని తమ గ్రామాల్లో మద్యం దుకాణాల ఏర్పాటుకు అనుమతించబోమని పెదపళ్ల, చింతలూరు, సంధిపూడి, పినపళ్ల పంచాయతీలు తీర్మానించాయి. గతంలో కళాశాల, పాఠశాలలకు సమీపంలో రహదారి పక్కనే ఉన్న దుకాణాల వల్ల విద్యార్థినులు, యువత, వృద్ధులు, మహిళలు, వాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని మంగళవారం ఆయా గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో ద్విచక్రవాహనంపై ప్రచారం చేశారు.

అంతర్వేది: ఆధ్యాత్మిక ప్రదేశంగా పేరొందిన అంతర్వేదిలో గృహాల మధ్య మద్యం దుకాణం పెట్టొద్దని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం మద్యం దుకాణాలను లాటరీ పద్ధతి ద్వారా కేటాయించడంతో ఎంపికైన వారిలో ఒకరు ఆవాసాల మధ్య ఏర్పాటు చేస్తున్నారని, దీన్ని వెంటనే విరమించుకోవాలని కోరారు. సర్పంచి జాన్‌బాబు, ఎక్సైజ్ సీఐ సీహెచ్ వీరబాబుకి ఫిర్యాదు చేశారు. గతంలో ఇదే ప్రాంతంలో దుకాణం ఏర్పాటు చేస్తే ఆందోళన చేపట్టామన్నారు. మళ్లీ అదేచోట ఏర్పాటు చేయడం తగదన్నారు. దీనిపై సీఐని వివరణ కోరగా పరిశీలించి వేరేచోటుకు మార్చేలా నిర్వాహకులకు తెలియజేస్తామని వెల్లడించారు.



ముంపు దిగక.. అవస్థలు తీరక

మామిడికుదురు మండలం ఈదరాడలోని హల్లికోడు చిన్నతరహా కాలువపై 460 ఎకరాల వరి ఆయకట్టు ఆధారపడి ఉంది. గ్రామంలోని నడిమిలంక వైపు కల్వర్టు వద్ద తుంగ, గుర్రపుడెక్క విపరీతంగా పెరిగిపోవడంతో సమస్య జటిలమైంది. దీనికితోడు వర్షంనీరు కూడా తోడవ్వడంతో ఇబ్బందులు మరింత పెరిగాయని ఈదరాడ, కమ్మవానిలంక, చెన్నడం రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నీటిపారుదల సజావుగా సాగేలా సత్వర చర్యలు తీసుకోవాలని విన్నవిస్తున్నారు. ఈ విషయాన్ని రాజోలు డ్రెయినేజీ శాఖ ఏఈఈ ఆనంద్‌కిరణ్ దృష్టికి మంగళవారం తీసుకువెళ్లగా తుంగ, గుర్రపుడెక్కను తొలగించేందుకు చర్యలు చేపడతామన్నారు.

– న్యూస్‌టుడే, మామిడికుదురు

అంగన్‌వాడీ కేంద్రాల్లో సక్ష్యం

– న్యూస్‌టుడే, పి.గన్నవరం

అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులకు మెరుగైన వసతులు కల్పించేందుకు 'సక్ష్యం 2.0 పోషణ' పథకాన్ని అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పి.గన్నవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 43 కేంద్రాల్లో అమలు చేసేందుకు ఇప్పటికే అధికారులు ప్రతిపాదనలు పంపారు. సొంత, అద్దె తీసుకోకుండా కొనసాగుతున్న భవనాల్లో దీనిని అమలు చేసేందుకు ప్రతిపాదించారు. ఎంపిక చేసిన కేంద్రాల్లో న్యూట్రిగార్డెన్, రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్, ఇతర మౌలిక వసతులు కల్పిస్తారు. న్యూట్రిగార్డెన్‌కు రూ.10 వేలు, రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్‌కు రూ.16 వేలు, ఇతర మౌలిక వసతులకు రూ.19,800 కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తుంది. న్యూట్రిగార్డెన్‌లో మునగ చెట్లు విధిగా పెంచుతారు. 43 కేంద్రాల్లోనే కాకుండా మరో 65 కేంద్రాల్లో తాగునీటి వసతి, 56 కేంద్రాల్లో మరుగుదొడ్ల ఏర్పాటుకు మంజూరు ఉత్తర్వులు వచ్చాయి. మరుగుదొడ్ల ఏర్పాటుకు ఒక్కో కేంద్రానికి రూ.36 వేలు, తాగునీటి వసతికి రూ.17 వేలు ప్రభుత్వం కేటాయిస్తుంది. 'సక్ష్యం' పథకానికి సంబంధించి ఎంపిక చేసిన 43 కేంద్రాలకు ప్రతిపాదనలను కలెక్టర్‌కు పంపామని, త్వరలో మంజూరు వస్తుందని సీడీపీవో డి.వెంకటేశ్వరి తెలిపారు.

పి.గన్నవరం ప్రాజెక్టు పరిధిలో ఇలా..

మొత్తం అంగన్‌వాడీ కేంద్రాలు:	301
మినీ అంగన్‌వాడీ కేంద్రాలు:	33
సొంత భవనాలు ఉన్నవి:	140
ఉచితం:	26
అద్దె ప్రాతిపదికన:	135
ఆరు నెలల నుంచి మూడేళ్ల పిల్లలు:	6,957
మూడేళ్ల నుంచి ఆరేళ్ల పిల్లలు:	3,284
గర్భిణులు:	1,556
బాలింతలు:	1,393



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీడీపీవో వెంకటేశ్వరి

రసాయన ఎరువులు వాడొద్దు

సఖినేటిపల్లి, న్యూస్‌టుడే: రసాయన ఎరువులు అతిగా వాడొద్దని, ప్రకృతి ఎరువులను రైతులు స్వయంగా తయారు చేసుకుని వ్యవసాయం చేయాలని సఖినేటిపల్లి ఏవో నరసింహారావు కోరారు. అంతర్వేది దేవస్థానం, అంతర్వేదికరలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. ప్రకృతి వ్యవసాయం వల్ల వచ్చే ఉత్పత్తులు ఆరోగ్యానికి మంచిదని వివరించారు. ప్రతిఒక్కరూ ఈ విధానంపై అవగాహన పొంది ముందుకు సాగితే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు జాన్‌బాబు, కిషోర్, తెదేపా మండల బీసీ సెల్ అధ్యక్షుడు కొల్లు మహాలక్ష్మి, కూటమి నాయకులు, అన్నదాతలు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

వాడపల్లి(ఆత్రేయపురం), న్యూస్‌టుడే: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి జంగారెడ్డిగూడేనికి చెందిన పరిమి సత్యనారాయణ కుటుంబ సభ్యులు మంగళవారం రూ.50 వేలు విరాళం అందజేశారు. వీరికి దేవస్థానం ప్రతినిధి వర్మ స్వామివారి చిత్రపటం అందజేశారు.

అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం

రేషన్ కార్డుల పంపిణీకి చర్యలు

యానాం, న్యూస్‌టుడే: యానాంలో అర్హులకు రేషన్ కార్డుల పంపిణీ చేపట్టక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని పుదుచ్చేరి పౌరసరఫరాల శాఖ కార్యదర్శి ఉదయ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లానని త్వరలోనే రేషన్ కార్డుల పంపిణీ చేపట్టడం జరుగుతుందని పుదుచ్చేరి ప్రభుత్వ దిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఓ ప్రకటనలో తెలిపారు. రేషన్ కార్డులపై విచారణ నిర్వహించి డిసెంబరు 4వ తేదీ తర్వాత కార్డులను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. పసుపు రంగు కార్డు నుంచి ఎరుపు రంగు కార్డుగా మార్చడానికి దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. కార్డులు ఇప్పిస్తామని డబ్బులు వసూలు చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని.. వాటిని నమ్మి ప్రజలు మోసపోవద్దని కృష్ణారావు విజ్ఞప్తి చేశారు.

అమ్మవారి లడ్డూ రూ.10,900

ముమ్మిడివరం: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ముమ్మిడివరం మండలం రాజీలంక దేవీ సెంటర్‌లోని అమ్మవారి ఆలయంలో లడ్డూ ప్రసాదానికి మంగళవారం వేలం పాట నిర్వహించారు. స్థానిక అయ్యప్పస్వామి మాలధారులు రూ.10,900కు అమ్మవారి లడ్డూ ప్రసాదాన్ని వేలంలో పాడుకున్నారు. వీరికి ఆలయ కమిటీ ప్రసాదాన్ని అందజేశారు.

ధనకాసులమ్మ వార్షికోత్సవం

ఐ.పోలవరం: జి.మూలపొలంలోని ధనకాసులమ్మ అమ్మవారి వార్షికోత్సవ పూజలు మంగళవారం ఘనంగా జరిగాయి. సోమయాజుల వివా కర్శర్మ, ముప్పంగి రామకృష్ణశర్మల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి చండీహోమం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నేడు శ్రీదేవి అమ్మవారి ఊరేగింపు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: అమలాపురం పట్టణంలోని పలు ఆలయాల్లో విజయదశమి శరన్నవరాత్రి ఉత్సవాలు మంగళవారం ముగిశాయి. శ్రీవారాహి అలంకరణలో శ్రీదేవి అమ్మవారిని అలంకరించారు. అమ్మవారి నిమజ్జన ఊరేగింపు బుధవారం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. కల్వకొలను వీధిలోని వేపచెట్టు కనక దుర్గ ఆలయంలో అమ్మవారిని భక్తులు, మహిళలు దర్శించుకుని పూజలు నిర్వహించారు. అమలాపురం పురపాలక సంఘం కార్యాలయంలో పూజా కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, మున్సిపల్ ప్రతిపక్షనాయకుడు ఏడిద శ్రీను, బొర్రా వెంకటేశ్వరరావు, బోణం సత్యవరప్రసాద్, మెట్ల సత్య తదితరులు పాల్గొన్నారు.



శ్రీవారాహి అలంకరణలో అమలాపురం శ్రీదేవి అమ్మవారు

బాల్యం.. ఎదుగుదల లోపం

న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

ఆడుతూపాడుతూ ఉత్సాహంగా గడపాల్సిన బాల్యంలో కొందరు పిల్లల్ని ఆరోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. ఎత్తు, వయసుకు తగ్గ బరువు ఉండటం లేదు. మరికొందరిలో ఎదుగుదల లోపం ఉంది. పోషకాహార లోపమే దీనికి కారణమని వైద్యులు చెబుతున్నారు. గర్భస్థశిశువుగా ఉన్నప్పటి నుంచి ఆరేళ్లు వచ్చే వరకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం అందిస్తున్నా, కొందరిలో ఈ సమస్యలు బయటపడుతున్నాయి. గతంలో రాష్ట్ర ప్రభుత్వం కందిపప్పు సరఫరా నిలిపివేసింది. పోష్టికాహార లోపానికి ఇదీ ఒక కారణమని చెబుతున్నారు. అమలాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అమలాపురం పట్టణం, గ్రామీణం, అల్లవరం, ఉప్పలగుప్తం మండలాలున్నాయి. ఇక్కడి పిల్లలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోష్టికాహారం అందిస్తున్నాయి.

వయసుకు తగ్గ ఎత్తు, బరువు పెరగని వైనం

లెక్కల్లో కొంతే..

అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు ఒక్కొక్కరికి రోజూ రూ.30 చొప్పున 25 రోజులపాటు రూ.750 వెచ్చిస్తున్నారు. క్షేత్రస్థాయిలో చూస్తే పిల్లల్లో పోష్టికాహార లోపం బయటపడుతోంది. అంగన్‌వాడీ సిబ్బంది చిన్నారులపై సక్రమంగా శ్రద్ధ వహించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. అమలాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో సుమారు 300 మంది వరకు పోషకాహార లోపంతో బాధపడుతున్నట్లు అంచనా. అధికారిక లెక్కల ప్రకారం మాత్రం ఈ సంఖ్య 173గా ఉంది.

ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని వివరాలు

అంగన్‌వాడీ కేంద్రాలు	235
చిన్నారులు	12,082
వయసుకుతగ్గ బరువులేనివారు	39
ఎత్తుకుతగ్గ బరువులేనివారు	36
వయసుకుతగ్గ ఎత్తులేని పిల్లలు	98

అవగాహన కల్పిస్తున్నాం

చిన్నారుల్లో పౌష్టికాహార లోపం రాకుండా చర్యలు తీసుకుంటున్నాం. దీనిపై అంగన్‌వాడీ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నాం. అంగన్‌వాడీ కేంద్రాలకు తనిఖీలకు వెళ్లే సమయాల్లో పౌష్టికాహారం పంపిణీపై దృష్టి సారిస్తున్నాం. ఈ మేరకు ఉన్నతాధికారులకు నివేదికలు అందిస్తున్నాం.

- విజయశ్రీ, సీడీపీవో, అమలాపురం



ఈదరపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల బరువును చూస్తున్న సహాయకురాలు

డిమాండ్లు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

కాట్రేనికోన: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం నుంచి నల్లబ్యాడ్జీలను ధరించి విధులకు హాజరవుతున్నామని జిల్లా సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ అధ్యక్షుడు వై.రామచంద్రరావు తెలిపారు. సహకార సంఘాలలో 2019 తర్వాత నియమించిన ఉద్యోగులను తొలగిస్తే ఆందోళన చేయటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరి వయోపరిమితి 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలని, జీవో నం.36 ప్రకారం వేతన సవరణ అమలుచేసి జీతభత్యాలు ఇప్పించాలన్నారు. ఈ నెల 21న డీసీసీబీ ప్రధాన కార్యాలయం కాకినాడలో ధర్నా చేస్తామన్నారు.

పల్లె ప్రగతే కూటమి అజెండా

అల్లవరం, న్యూస్‌టుడే: దేశాభివృద్ధికి పల్లెలే పట్టుకొమ్మలనే సిద్ధాంతాన్ని కూటమి ప్రభుత్వం నిజం చేసేందుకు కృషి చేస్తోందని ఎమ్మెల్యే ఆనందరావు అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా అల్లవరం మండలంలో మంగళవారం పలు గ్రామాల్లో ఉపాధి హామీ నిధుల రూ.58 లక్షలతో నిర్మించే సీసీ రహదారులకు శంకుస్థాపన చేశారు. ఓడలరేవు, మొగళ్లమూరు, గోడి, గోడిలంక, అల్లవరం తదితర గ్రామాల్లో సీసీ రహదారుల నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషారావు, మండల తెదేపా అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబు రాజు, ఆయా గ్రామాల సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.



మొగళ్లమూరులో సీసీ రహదారికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు, తదితరులు

నేడు పల్లె పండుగ

ఐ.పోలవరం: ఐ.పోలవరం మండలంలో 16న(బుధవారం) పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 9గంటలకు కేశనకుర్రులో ప్రారంభమై టి.కొత్తపల్లి, కొమరగిరి, మురమళ్ల, పశువుల్లంక, ఎదుర్లంక, జి.వేమవరం, గుత్తెనదీవి, భైరవపాలెం గ్రామాల్లో జరుగుతుంది. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ముఖ్య అతిథిగా హాజరై ఎన్ఆర్‌ఈజీఎస్ నిధులతో మంజూరైన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ఖరారు చేస్తూ ఎమ్మెల్యే కార్యాలయం పత్రికా ప్రకటన విడుదల చేసింది.

కలాం స్ఫూర్తి కొనసాగించాలి



కలాం విగ్రహానికి నివాళి అర్పిస్తున్న అధ్యాపకులు

అమలాపురం గ్రామీణం: మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం ఆశయాలను నేటి యువత కొనసాగించాలని భట్లపాలెం బీవీసీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ జె.వి.జి.రామారావు అన్నారు. స్థానిక కళాశాలలో కలాం జయంతి సందర్భంగా మంగళవారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఏవో కృష్ణారావు, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

అమలాపురం పట్టణం: మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం సేవలు మరువలేనివని భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా సుబ్బారావు కొనియాడారు. గడియారస్తంభం ప్రాంగణంలో అబ్దుల్ కలాం జయంతిని కోనసీమ ముస్లిం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు బషీర్, హుస్సేన్, రమణ, షఫీ, అరిగెల తేజా, ఫిరోజ్, కరీముల్లా బాబా తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

స్పందనకు పందనం

వీధిదీపాలకు మరమ్మతులు

సమస్య: కాట్రేనికోన పంచాయతీ పరిధిలోని సత్తెమ్మచెట్టులో కొన్ని వీధి దీపాలు వెలగడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి వీధిదీపాలకు మరమ్మతులు చేపట్టాలి. - రాజే, స్థానికుడు

పరిష్కారం: సమస్యను పంచాయతీ సర్పంచి సుధాకర్ దృష్టికి తీసుకువెళ్లగా స్పందించారు. సిబ్బందితో వీధిదీపాలకు అవసరమైన మరమ్మతులు చేయించారు.

చెత్త తొలగించారు

సమస్య: గెద్దనపల్లి పరిధిలో రోడ్డుపక్కన చెత్త పేరుకుపోయింది. పంచాయతీ అధికారులు స్పందించి చెత్తను తొలగించే పనులు చేపట్టాలి. - గ్రామస్థులు

పరిష్కారం: ఈ సమస్యను సర్పంచి సీతారామకృష్ణంరాజుకు తెలపగా స్పందించారు. సిబ్బందితో పరిసరాల్లో చెత్తను తొలగించారు.

- న్యూస్‌టుడే, కాట్రేనికోన

సమయం: ఉ. 10 గం. నుంచి మ. ఒంటి గంట మధ్య
మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:
అమలాపురం: 79811 19595, ముమ్మిడివరం: 80085 74166

ఇలా వదిలేశారు..!

ఉప్పలగుప్తం మండలం చల్లపల్లి-2 పర్రపేటలో మూడేళ్లక్రితం ప్రారంభించిన సచివాలయ భవనం పనులు నిలిచిపోయాయి. విద్యుత్తు, ప్లంబింగ్, మరుగుదొడ్లు తదితర పనులు చేయాల్సి ఉంది. సచివాలయ సిబ్బంది ప్రస్తుతం పాత భవనంలో విధులు నిర్వర్తిస్తున్నారు. నిర్మాణం పూర్తికావాలంటే రూ.4 లక్షల అదనపు నిధులు అవసరమని అధికారులు చెబుతున్నారు. దీనిపై పీఆర్ జేఈ రాధాకృష్ణ మాట్లాడుతూ నిలిచిపోయిన భవనాలు పూర్తిచేయడానికి కార్యాచరణ జరుగుతోందన్నారు.



- న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

దారి.. అధ్వానంగా మారి

ఉప్పలగుప్తం మండలం బట్టుపాలెం నుంచి సూదాపాలెం మీదుగా అమలాపురం మండలం సమనస చేరుకునే రహదారి అధ్వానంగా మారింది. బట్టుపాలెంలోని కనకదుర్గ ఆలయం వద్ద, సూదాపాలెం, సమనసలో ఇదే పరిస్థితి నెలకొంది. రెండు మండలాలను కలిపే ఈ రహదారికి తగిన మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.



- న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

కాలువ నిర్మించరూ..!

కాట్రేనికోన పంచాయతీ పరిధి రామాలయం నుంచి కొప్పిశెట్టివారి వీధికి వెళ్లే సీసీ రోడ్డుపై కొద్దిపాటి వర్షానికే నీరు నిలుస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ పరిసరాల్లో కాలువ లేకపోవడంతో వర్షం కురుస్తున్న ప్రతిసారి రోడ్డుపై రోజుల తరబడి నిలుస్తోందని అంటున్నారు. అధికారులు స్పందించి రోడ్డుపై నీరు నిలిచిపోకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. సర్పంచి సుధాకర్ దృష్టికి తీసుకువెళ్లగా అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.



- న్యూస్‌టుడే, కాట్రేనికోన

సన్నవిల్లి మాజీ సర్పంచి మృతి



ఉప్పలగుప్తం: సన్నవిల్లి మాజీ సర్పంచి, తెదేపా నాయకుడు గుత్తెటి వీరాస్వామినాయుడు(75) సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. సన్నవిల్లి గ్రామాభివృద్ధికి విశేష కృషి చేశారు. తెదేపా ఆవిర్భావం నుంచి పార్టీకోసం పనిచేశారు. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, పార్టీ మండలాధ్యక్షుడు అరిగెల నానాజీ, దేశంశెట్టి లక్ష్మీనారాయణ, సర్పంచి చిక్కం జంగమయ్య తదితరులు నివాళి అర్పించారు.

దరఖాస్తు గడువు పెంపు

యానాం: యానాం ప్రాంతానికి చెందిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 2024-25 సంవత్సరానికి సంబంధించి ప్రీమెట్రిక్, ఆర్యాప్, నిరీక్షణ్, విద్యాదాన్, పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలకు ఆన్‌లైన్ దరఖాస్తుల గడువును ఈనెల 28వ తేదీ వరకు పొడిగించినట్లు ఆదిద్రావిడ వెల్ఫేర్, షెడ్యూల్ ట్రైబ్ సంక్షేమశాఖ ఏడీ రేకాడి కృష్ణమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

సానుకూల దృక్పథం అలవర్చుకోవాలి

యానాం, న్యూస్‌టుడే: సానుకూల దృక్పథాన్ని అలవర్చుకోవడం ద్వారా మంచి అలవాట్ల వైపు మరలుతారని వ్యక్తిత్వ వికాస నిపుణుడు బీవీ సైరాన్‌కుమార్ అన్నారు. యానాంలోని డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్, ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ వరుగు భాస్కరరెడ్డి అధ్యక్షతన 'మాదక ద్రవ్యాల వ్యసనం-శరీరక, మానసిక స్థితులపై వాటి ప్రభావం' అనే అంశంపై మంగళవారం సదస్సు నిర్వహించారు.

ఆస్తులపై నివేదిక ఇవ్వండి

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా ఉన్న అన్ని దేవాలయాలకు సంబంధించిన స్థిర, చరాస్తులను సేకరించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని దేవాదాయశాఖ అధికారులను లెఫ్టినెంట్ గవర్నర్ కె.కైలాశనాథన్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. రాజ్‌నివాస్‌లోని పార్లర్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆలయ భూములను కొంతమంది అక్రమంగా ద్రువీకరణ పత్రాలను సృష్టించి రిజిస్ట్రేషన్ చేయించుకునే ప్రయత్నం గతవారం బయటపడిందని. దీనిపై సమగ్రదర్యాప్తు జరిపి కాల్ సబ్‌కలెక్టర్ ఎస్.జాన్సన్, ఇద్దరు సర్వే అధికారులతో ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ నిర్వహించి రూ.కోట్లు విలువ చేసే భూములు కాపాడాలని సూచించారు.

అనుమానాస్పద స్థితిలో మృతి

తుని పట్టణం, కాట్రేనికోన: తుని పట్టణంలోని ఉలవకారవారి వీధిలో ఉన్న ఇంటి ఆవరణలో ఓ వ్యక్తి మృతి చెందాడు. కాట్రేనికోన మండలం నడవపల్లి పరిధి గడ్డివారిపేటకు చెందిన అయితాబత్తుల రవికిరణ్(40)గా గుర్తించినట్లు సీఐ ఎం.గీతారామకృష్ణ తెలిపారు. అతడు ఈ ఇంటి వద్ద తరచూ తిరుగుతుండటం చూశామని స్థానికులు తెలిపారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామన్నారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

శిథిలం.. ఎంత పదిలం

నివాసాలు, పాఠశాలల చేరువలో ఆందోళనకరంగా భవనాలు




చల్లపల్లి పర్రపేటలో నివాస గృహాల చెంత శిథిల తుపాను భవనం

న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం, కాట్రేనికోన

ఉప్పలగుప్తం, కాట్రేనికోన మండలాల్లోని పలు ప్రాంతాల్లో శిథిల తుపాను భవనాలతో ప్రమాదం పొంచి ఉంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు, తుపాను గాలుల ధాటికి ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గ్రామాల్లో చాలా చోట్ల ప్రభుత్వ పాఠశాలలు, నివాసాల చెంత ఇవి ఉండటం గమనార్హం. గత ఆరేళ్లుగా వైకాపా ప్రభుత్వం వీటిపై దృష్టి సారించలేదు.

ఉప్పలగుప్తం మండలంలో..

ఉప్పలగుప్తం మండలం చల్లపల్లి పర్రపేట వద్ద ప్రాథమిక పాఠశాల, తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంకు చెంతనే శిథిల తుపాను భవనం ఉంది. ఆయిదేళ్లుగా ఈ భవనం నుంచి పెచ్చులూడుతున్నా అధికారులు పట్టించుకోలేదు. చల్లపల్లి ప్రధాన కూడలి వద్ద ప్రాథమిక ఆరోగ్యకేంద్ర భవనం శిథిలావస్థకు చేరి పిచ్చిమొక్కలు పెరిగాయి. దీనిని తొలగించలేదు. అక్కడి నుంచి విష కీటకాలు చుట్టుపక్కల నివాసగృహాల్లోకి ప్రవేశిస్తున్నాయి. ఇదే గ్రామంలో చింతలచెరువు ప్రాంతంలో శిథిల తుపాను భవనంలో ప్రస్తుతం సచివాలయాన్ని నిర్వహిస్తున్నారు. ఎస్.కొత్తపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న తుపాను భవనం శిథిలావస్థలో ఉంది. ఇదే గ్రామంలోని పెదరామపుల పేటలో ప్రాథమిక పాఠశాల, తాగునీటి సంప్ చెంతనే శిథిల తుపాను భవనం ఉంది. పాఠశాల విద్యార్థులు, ప్రజలు నిత్యం ఈ భవనం చెంతనే సంచరిస్తు ఉంటారు.



నీలరేవులో శిథిలభవనం ఇలా..

కాట్రేనికోన మండలంలో..

కాట్రేనికోనలో తీరగ్రామాల్లో ఎప్పుడో నిర్మించిన తుపాను భవనాలు శిథిలస్థితికి చేరి ప్రమాదకరంగా ఉన్నాయి. గచ్చకాయలపోర, చిర్రయానం ప్రాంతాల్లోని భవనాలు పూర్తిగా శిథిలమయ్యాయి. తదితరచోట్ల సుమారు 20 ఏళ్లక్రితం నిర్మించిన భవనాలు శిథిలస్థితికి చేరాయి. ఇందులో కొన్ని పెచ్చులూడుతున్నాయి. నీలరేవులో భవనం శిథిలస్థితికిచేరింది. ఎక్కడికక్కడ భవనంపై మొక్కలు మొలిచాయి. నూతన భవనాలు నిర్మించినప్పటికీ పాతవాటిని తొలగించలేదు.

దీపావళికి బియ్యం, పంచదార

యానాం: పుదుచ్చేరి ప్రభుత్వం దీపావళి కానుకగా రేషన్‌కార్డుదారులకు 10 కిలోల బియ్యం, 2 కిలోల పంచదార ఉచితంగా అందజేయనుంది. పండుగకి సంబంధించి త్వరితగతిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు ప్రభుత్వం సూచించింది.



భగవద్గీత పుస్తకాలను అందిస్తున్న సేవా సంఘం సభ్యులు

హిందూ ధర్మాన్ని పరిరక్షించాలి

అమలాపురం గ్రామీణం: హిందూ ధర్మాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందని శ్రీలక్ష్మీగణపతి సేవా సంఘం అధ్యక్షుడు ఉప్పుగంటి భాస్కరరావు అన్నారు. బండారులంకలో మంగళవారం ఇంటింటా భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేశారు. కోశాధికారి కాలెపు భీమేశ్వరరావు, బళ్ల మల్లేశ్వరరావు, వండు, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

కుమ్మరి శాలివాహన సంఘం సమావేశం

అంబాజీపేట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కుమ్మరి శాలివాహన సంఘ సమావేశం మాచవరంలో మంగళవారం జరిగింది. కార్తిక వనసమారాధన కార్యక్రమాన్ని నవంబరు 17న మాచవరంలోని సంఘ భవనంలో జరపడానికి నిర్ణయించారు.

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: వరి పైరులో తెగుళ్లు, చీడపీడల వ్యాప్తిని అరికట్టడానికి రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ ఏవీఎస్ రాజశేఖర్ సూచించారు. ముమ్మిడివరం మండలం రాణిలంక సేవా కేంద్రం వద్ద మండల వ్యవసాయాధికారి ఎస్.ప్రశాంత్‌కుమార్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో రాజశేఖర్ పాల్గొని మాట్లాడారు. ఆర్‌ఎండీఎస్ పథకంలో కొబ్బరి తోటల్లో కాపు నిలబెట్టడం, పిందెలు రాలకుండా నివారణకు బోరాన్ వేయాలని అన్నారు. ఇతర తెగుళ్లకు చనిపోయిన కొబ్బరిమొక్కలను తొలగించడానికి చెట్టుకు రూ.1000 అందించడంతో పాటు.. మొక్కలను అందించడం జరుగుతుందని ఉద్యానవన విస్తరణాధికారి పవిత్ర వివరించారు.

ఉప్పలగుప్తం: రైతులు ఆధునాతన పరిజ్ఞానం పెంపొందించుకుని అధిక దిగుబడులు పొందాలని పొలం పిలుస్తోంది కార్యక్రమం ఉపయోగ పడుతుందని మండల వ్యవసాయాధికారి గుత్తుల కుమార్ బాబు అన్నారు. గొల్లవిల్లిలో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ధాన్యం కొనుగోలు, ఈ క్రాప్ బుకింగ్, పంటలపై చీడపీడల నివారణ తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ సహాయకుడు రవిచంద్ర, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



రాణిలంకలో వరి చేలను పరిశీలిస్తున్న అధికారులు

జోరుగా మద్యం విక్రయాలు

కాట్రేనికోన: పల్లంలో జాతరను పురస్కరించుకుని జోరుగా మద్యం విక్రయాలు సాగాయి. ఆదివారం నుంచి మూడు రోజుల పాటు పల్లం గ్రామంలో జాతర ఉత్సవాలు జరిగాయి. ఈ క్రమంలో పలు ప్రాంతాల్లో అక్రమ మద్యం విక్రయాలు జోరుగా సాగాయి. మట్టా పోలీసులు బందోబస్తు ఉన్నప్పటికీ వారి కళ్లుగప్పి మారుమూల ప్రాంతాల్లో భారీగా మద్యం విక్రయించారు. బకెట్లో మద్యం సీసాలు ఉంచి విక్రయిస్తున్న వీడియో మంగళవారం రాత్రి సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేసింది. దీనిపై ఎక్సైజ్, పోలీసుశాఖల అధికారులు స్పందించి తీరగ్రామాల్లో అక్రమ మద్యం విక్రయాలపై ప్రత్యేక దృష్టిసారించి నిలువరించాలని పలువురు కోరుతున్నారు.



ముంపులో రహదారులు



చెరువును తలపిస్తున్న వనచర్లవారి వీధి

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: వర్షానికి పట్టణంలోని రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. మురుగు కాలువ వ్యవస్థ సరిగాలేక మురుగు కాలువలు పొంగి రోడ్లను ముంచెత్తుతున్నాయి. సావరంరోడ్డు, విద్యుత్తు నగర్‌లలో రహదారులపై నీరు చేరడంతో స్థానికులు, వాహనదారులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. బస్టాండ్ నుంచి ఈదరపల్లి వెళ్లే రహదారి నీటితో నిండింది.



సావరం రోడ్డులో మురుగు

అయిదేళ్లుగా నరకం..

మేం సావరం వెళ్లే దారిలో నివాసం ఉంటున్నాం. ఇక్కడ సరైన మురుగుకాలువ వ్యవస్థ లేదు. వర్షం వస్తే రోడ్డు మునిగిపోతోంది. బయటకు వెళ్లలేకపోతున్నాం. ప్రజాప్రతినిధులు, అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా ఫలితం లేదు. - సత్యనారాయణ


గంధోత్సవంలో ముస్లిం సోదరులు

భక్తిశ్రద్ధలతో గంధోత్సవం

ద్రాక్షారామ: ద్రాక్షారామ శివారు పోలాజయం మసీదులో హజరత్ మహబూబ్ సుబానీ గంధోత్సవాన్ని మంగళవారం ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. మసీదు అధ్యక్షుడు సయ్యద్ పాషా ఆధ్వర్యంలో చందనం, జెండాను వెలుపలికి తీసుకువచ్చి, ద్రాక్షారామ పురవీధుల్లో ఊరేగించారు. మతగురువు మౌలానా గులాబ్ ముస్తఫా పాతీహాను చేశారు. అనంతరం వచ్చిన భక్తులకు విందు ఏర్పాటు జరిగింది. మసీదు కార్యదర్శి బాబులాల్, షేక్ జమాల్ హుస్సేన్, అలీఖాన్, నౌషాద్ బాబు, హుస్సేన్ ఆగా, ఎస్కే బబ్లీ పాల్గొన్నారు.

మండపేట

• మండపేట • రామచంద్రపురం

ఎట్టకేలకు కాలువ శుభ్రం

ఈనాడు స్పందన



రామచంద్రపురం: రామచంద్రపురం పట్టణంలో సిబ్బంది కొరతతో ఇబ్బందులు, ప్రతి రోజూ మురుగు కాలువలను శుభ్రం చేయట్లేదంటూ ఈ నెల 8వ తేదీన "ముందు చూపు లేకనే మురుగు ముంపు" అనే శీర్షికన ఈనాడులో కథనానికి అధికారులు స్పందించారు. కమిషనర్ అయ్యప్పనాయుడు ఆదేశం మేరకు శానిటరీ తనిఖీదారు దేవీదొరబాబు, శానిటరీ కార్యదర్శి కృష్ణ తదితరుల ఆధ్వర్యంలో సిబ్బంది గ్యాంగ్ వర్కులుగా ప్రారంభించి రోజుకొక వార్డును ఎంచుకుని కాలువలను శుభ్రం చేస్తున్నారు. దీనిలో భాగంగానే మంగళవారం 5వ వార్డు వైఎస్సార్ నగర్ ప్రధాన మురుగు కాలువలో సిల్టు తొలగించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ 10 గం. నుంచి మ. 12 గంట వరకు

మండపేట: 80085 74183, రామచంద్రపురం: 80085 74191

మురుగు పారడంలేదు..

సమస్య: మండపేట మండలం జడ్.మేడపాడు పంచాయతీ పరిధి ప్రధాన మురుగుకాలువలో మురుగు పారడంలేదు. దీంతో దుర్వాసన వెదజల్లుతుంది. సమస్య పరిష్కరించాలి.
- పి.సూరిబాబు, జడ్.మేడపాడు

సమాధానం: జడ్.మేడపాడు పంచాయతీ పరిధి ప్రధానకాలువలో మురుగు పారుదల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.
- అమలినాథ్‌చౌదరి, పంచాయతీ కార్యదర్శి, జడ్.మేడపాడు

చెత్త తొలగించరూ..

సమస్య: ద్వారపూడి పంచాయతీ పరిధి వీవర్సుమార్కెట్ వీధిలో రహదారి పక్కన చెత్త పోస్తున్నారు. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది.
- డి.సురేష్, ద్వారపూడి

సమాధానం: ద్వారపూడి పంచాయతీ పరిధి వీవర్స మార్కెట్ వీధిలో రహదారి పక్కన పోస్తున్న చెత్తను తొలగించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.
- ఆకుల వీవీ.రమణ, పంచాయతీ కార్యదర్శి, ద్వారపూడి

– న్యూస్‌టుడే, ద్వారపూడి

వెలగని వీధి దీపాలు..

సమస్య: ఏడిద రేవుపేట కాలనీలో సరిగా విద్యుత్తు దీపాలు వెలగడంలేదు. వారంరోజులుగా రాత్రి సమయంలో స్థానికులు చీకట్లో రాకపోకలు సాగిస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి.
-కె.గోపాలకృష్ణ, ఏడిద

సమాధానం: కాలనీలో విద్యుత్తు దీపాలు పరిశీలించి చర్యలు తీసుకుంటాం.
-పి.శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి, ఏడిద

నీటి పారుదలకు అడ్డంకులు

సమస్య: తాపేశ్వరం నుంచి అర్తమూరు వెళ్లే కాలువలో రేవుడు స్థలం వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలు అడ్డుపడ్డాయి. నీటిపారుదలశాఖ అధికారులు చర్యలు చేపట్టాలి.
- పి.రామమూర్తి, తాపేశ్వరం

సమాధానం: లస్కర్‌లతో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తాం.
- అజీజ్, నీటిపారుదల శాఖ, జేఈ తాపేశ్వరం సెక్షన్

– న్యూస్‌టుడే, మండపేట గ్రామీణం

కొన్నారు.. వదిలేశారు

అడవులను తలపిస్తున్న ఖాళీస్థలాలు

భవిష్యత్తులో ఉపయోగపడుతుందని కొందరు.. కొని వదిలేస్తే మంచి ధర వచ్చినప్పుడు అమ్ముకోవచ్చని మరికొందరు పట్టణాల్లో స్థలాలు కొంటున్నారు. ఆ తర్వాత వాటి గురించి పట్టించుకోవడం లేదు. ఫలితంగా ఆ స్థలాల్లో చెట్లు మొలిచి, వర్షం నీరు నిలిచి దోమలు, పాములకు నిలయాలుగా మారుతున్నాయి. దీంతో స్థలాల పక్క, ఇళ్ల వారు, ఆ వీధుల్లో ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు.

-న్యూస్‌టుడే, రామచంద్రపురం


లలితానగర్‌లో చిట్టడవిని తలపిస్తున్న ఖాళీ స్థలం

రామచంద్రపురం పట్టణంలో ప్రైవేటు ఖాళీ స్థలాలు ఉన్నవారికి రోజురోజుకు లాభాలు పెరుగుతుంటే.. ఆ స్థలాలకు పక్కన, ముందు, వెనుక ఉన్న గృహాల వారికి మాత్రం రోజురోజుకు ప్రమాదం పొంచి ఉందని చెప్పక తప్పదు. పట్టణంలో మొత్తం 28 వార్డుల్లో 74 ప్రైవేటు ఖాళీ స్థలాలు సమస్యాత్మకంగా మారాయి. ఆ స్థలాల్లో పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగి పోవడం, అక్కడే రోజుల తరబడి వర్షం నీరు నిల్వ ఉండటం దోమల పెరగడం, కొన్ని చోట్ల ప్రైవేటు ఖాళీస్థలాల పక్కనే పురపాలక అధికారులు చెత్త వేయడం వెరసి రోగాలకు నిలయాలుగా ఖాళీ స్థలాలు మారాయని ప్రజలు వాపోతున్నారు. పురపాలక శాఖ అధికారులు సంబంధిత యజమానులకు నోటీసులిచ్చి ఖాళీ స్థలాల్లో చెత్త లేకుండా చేయాలని పట్టణ వాసులు వేడుకుంటున్నారు.

అన్ని వార్డుల్లోనూ ఇదే సమస్య

పట్టణంలో 28 వార్డుల్లోను సుమారు 74 ప్రైవేటు ఖాళీస్థలాల్లో సమస్యలున్నాయని పురపాలక లెక్కలే చెబుతున్నాయి. ముఖ్యంగా 13వ వార్డు అఫీషియల్ కాలనీ, 16వ వార్డు లలితానగర్, 23వ వార్డు కొండల రావు వీధి, సూర్యానగర్ ప్రధాన రోడ్డు, మెయిన్ రోడ్డు, 10వ వార్డు లక్ష్మీగణపతి ఆలయం వద్ద, 28వ వార్డు చింతపల్లి సూర్యనగర్, 12వ వార్డు తోటవారి వీధి తదితర ప్రాంతాల్లో అధికంగా ప్రైవేటు ఖాళీ స్థలాలు అధ్వానంగా మారాయి.


అఫీషియల్ కాలనీలోని ఓ స్థలంలో మురుగు, పిచ్చిమొక్కలు

యజమానులకు నోటీసులిస్తాం

ప్రైవేటు ఖాళీ స్థలాల నుంచి రూ.3.5 కోట్లు పన్నుల బకాయిలు ఉన్నాయి. వాటన్నింటి యజమానులకు నోటీసులిస్తాం. ఆయా ఖాళీ స్థలాల్లో మొక్కలను తొలగించాలని శుభ్రంగా వాటిని ఉంచాలని ఆదేశాలిస్తాం. కొన్ని స్థలాల యజమానులు అడ్రసు దొరకడం లేదు. వాటిని గుర్తించి తగిన చర్యలు చేపడతాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.
- వి.అయ్యప్ప నాయుడు, మున్సిపల్ కమిషనర్, రామచంద్రపురం

విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ


మండపేట: రాజమహేంద్రవరం నగరానికి చెందిన విలియంకారీ సుధాకర్ జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు మంగళవారం స్థానిక ఎస్‌వీఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రూ.20వేలు విలువ చేసే వివిధ రకాల క్రీడల కిట్లు, క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్.నాగకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో దాతలు హేమశిరీష, జాక్లిన్ విలియమ్స్, కేథరిన్ విలియమ్స్, సాల్మన్ దేవానంద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎం.శ్రీనివాసరావు, ఎం.సునీత, ఎల్.శ్రీనివాస్, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వేగుళ్ల పర్యటన నేడు

రాయవరం: పల్లెపండగ కార్యక్రమంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టేందుకు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు రాయవరం మండలంలో బుధవారం పర్యటించనున్నారు. మంగళవారం ఎంపీడీవో ఎస్.కీర్తిస్పందన మాట్లాడుతూ వెదురుపాక, రాయవరం,వెంటూరుల్లో జరిగే పల్లెపండుగ పంచాయతీ వారోత్సవాల్లో ఎంజీఎన్నార్జీఎస్ నిధులతో మంజూరైన పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేయనున్నారన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, మండల అధికారులు హాజరుకావాలన్నారు.

వరద బాధితులకు రూ.2 లక్షల విరాళం

రామచంద్రపురం, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల సహాయార్థం రామచంద్రపురం నియోజకవర్గంలో అమృతరక్ష ఆసుపత్రి అధినేత డాక్టర్ మడకా రాంబాబు, కాకినాడ సాయిరాఘవేంద్ర ఆసుపత్రి అధినేత డాక్టర్ కొండమూరి సత్యనారాయణ రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ సూచనల మేరకు ఒక్కొక్కరు రూ.లక్ష చొప్పున రెండు చెక్కులను మంగళవారం విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యులను ముఖ్యమంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో అమృతరక్ష ఆసుపత్రి డాక్టర్ మడకా రఘువీర్‌కాంత్, మాజీ కౌన్సిలర్ తెదేపా నాయకులు పసుపులేటి సత్తిబాబు, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు అక్కల రిష్వంత్‌రాయ్ తదితరులు పాల్గొన్నారు.


ముఖ్యమంత్రికి చెక్కులు అందజేస్తున్న వైద్యులు రాంబాబు, సత్యనారాయణ

పల్లెల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

అంగర, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. కపిలేశ్వరపురం మండలంలోని కోరుమిల్లి, వల్లూరు, అచ్యుతాపురం, అద్దంకివారిలంక, కపిలేశ్వరపురం గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మండపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి వేగుళ్ల లీలాకృష్ణతో కలిసి ఆయా గ్రామాల్లో కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహాత్మ గాంధీ ఉపాధి హామీ నిధులు రూ. 1,75,70,000తో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. వెదురుమూడిలో మరో రూ.5లక్షలతో ఐదు పనులకు ప్రతిపాదనలు చేసినట్లు చెప్పారు. వైకాపా హయాంలో అభివృద్ధి కుంటు పడిందని, తిరిగి గాడిన పెట్టే బాధ్యత తమ ప్రభుత్వం తీసుకుంటుందని పేర్కొన్నారు.


శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగుళ్ల, లీలాకృష్ణ

హసనబాదలో 'పొలం పిలుస్తోంది'

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: వ్యవసాయ, దాని అనుబంధ శాఖల ఆధ్వర్యంలో రామచంద్రపురం మండలం హసనబాద, తోటపేట గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి ఎన్.సత్యప్రసాద్ ఈ పంట నమోదు, ధాన్యం కొనుగోలు పద్ధతుల గురించి వివరించారు. తోటపేట గ్రామంలో పశువైద్య శిబిరం నిర్వహించి పశువులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి ఎం.కృష్ణార్జున, ఇతర శాఖల అధికారులు హసనబాద సర్పంచి నాగిరెడ్డి సతీష్‌రావు, మాజీ జెడ్పీ వైస్ ఛైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, చోడిశెట్టి శివాజీ, నల్లా బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచి, నాయకులు

కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు

రామచంద్రపురం: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రామచంద్రపురం రెవెన్యూ డివిజన్‌లో తుపాను కారణంగా ఈ నెల 15వ తేదీన కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు రామచంద్రపురం ఆర్డీవో కె.కౌసర్‌బానో తెలిపారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి కారణంగా ఈ నెల 17వ తేదీ వరకు కంట్రోల్ రూమ్‌లు ఉంటాయన్నారు. ఎప్పటికప్పుడు డివిజన్‌లో సంబంధిత అధికారులతో సమీక్షిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా డివిజన్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ల వివరాలను ఫోన్ నంబర్లతో సహా ఆమె మంగళవారం వెల్లడించారు.

కార్యాలయం పేరు	ఫోన్ నెంబరు
డివిజన్ స్థాయిలో రామచంద్రపురం ఆర్డీవో కార్యాలయం	08857–245166
రామచంద్రపురం తహసీల్దారు కార్యాలయం	9849903904
మండపేట తహసీల్దారు కార్యాలయం	9849903903
కె.గంగవరం తహసీల్దారు కార్యాలయం	8008803197
రాయవరం తహసీల్దారు కార్యాలయం	9849903905
కపిలేశ్వరపురం తహసీల్దారు కార్యాలయం	9493787996

మళ్లీ లోపించిన శుభ్రత

రామచంద్రపురం: రామచంద్రపురం 23వ వార్డు పరిధి త్యాగరాజ నగర్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎస్సీ వసతి గృహాల వెనుకనున్న వీధిలో తరచూ చెత్త పెరిగిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది జులై 2వ తేదీన ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సమావేశం నిమిత్తం విచ్చేసిన మంత్రి సుభాష్ చెత్తను చూసి విస్మయం వ్యక్తం చేశారు. వెంటనే పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించాలని పురపాలక అధికారులను ఆదేశించారు. అప్పట్లో శుభ్రం చేశారు. ఆ తర్వాత ఆ ప్రాంతంలో శుభ్రం చేయడం మరిచిపోయారు. సంబంధిత అధికారులు స్పందించి త్యాగరాజనగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వెనుక రోడ్డును శుభ్రం చేయించాలని పలువురు వేడుకుంటున్నారు.


త్యాగరాజ నగర్‌లో పేరుకుపోయిన చెత్త

అల్లుకున్న ప్రమాదం

ద్వారపూడి, న్యూస్‌టుడే: మండపేట మండలం జడ్.మేడపాడు గ్రామం ఎస్సీ కాలనీలో రహదారి పక్కన విద్యుత్ స్తంభానికి పచ్చని పాదులు అల్లుకున్నాయి. అవి తీగలను సైతం తాకుతుండటంతో వాటి ద్వారా విద్యుత్తు ప్రవహించే అవకాశం ఉంది. పొరపాటున ఎవరైనా తాకితే విద్యుదాఘాతానికి గురయ్యే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. స్థానికులు స్తంభం పక్క నుంచే నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని భయపడుతున్నారు. వెంటనే విద్యుత్తు తీగల నుంచి మొక్కల పాదులను తొలగించాలని సంబంధిత అధికారులను కోరుతున్నారు. దీనిపై విద్యుత్తు శాఖ ఏఈ డి.రవికుమార్‌ను వివరణ కోరగా వెంటనే స్తంభానికి అల్లుకున్న పాదుల తొలగింపునకు సత్వర చర్యలు తీసుకుంటామన్నారు.



రేవులోకి దిగవద్దు

పామర్రు: కోటిపల్లి స్నానఘట్టాల రేవు ప్రాంతంలో ఇటీవల తరచూ ప్రమాదాలు జరగడం, లోతు అంచనా వేయలేక కొత్తగా దిగిన వారు మునిగి గల్లంతయి చనిపోవడం జరుగుతుంది. రెండు రోజుల క్రితం రావిచెరువుకు చెందిన ఇద్దరు యువకులు ఇలాగే మృతి చెందారు. దాంతో పోలీసులు స్పందించారు. ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ఎవరూ రేవులోకి దిగవద్దని, లోతుకు వెళ్లవద్దని సూచించినట్టు ఎస్సై జానీబాషా వివరించారు.



కోటిపల్లి రేవు వద్ద ఏర్పాటు చేసిన బోర్డు

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం

అంగర, న్యూస్‌టుడే: కపిలేశ్వరపురం మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం మంగళవారం వాడీవేడిగా సాగింది. ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశానికి ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి సకాలంలో హాజరుకాకపోవడాన్ని కపిలేశ్వరపురం, వల్లూరు సర్పంచులు శాకా శ్రీనివాస్, దాసి మీనాకుమారి తప్పుపట్టారు. అనంతరం ఆమె 11.10 గంటలకు హాజరవడంతో సమావేశం ప్రారంభించారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఎమ్మెల్సీ త్రిమూర్తులు హాజరయ్యారు. ఎంపీడీవో కె.రత్నకుమారి ఆధ్వర్యంలో శాఖల వారీగా అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.


ఎమ్మెల్యేవేగుళ్ల, ఎంపీటీసీ సభ్యుడు పలివెల మధు మధ్య వాగ్వాదం

చర్చకొచ్చిన అంశాలు ఇవీ...

● మండలంలోని అచ్యుతాపురంలో 2014లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన మినీ గోకులం షెడ్డుకోసం గ్రామానికి చెందిన రైతుకు బిల్లులు ఎలా మంజూరు చేశారని వైకాపా ఎంపీటీసీ సభ్యుడు పలివెల మధు పశు సంవర్ధక శాఖ అధికారులను ప్రశ్నించారు. దీనిపై ఎమ్మెల్యే వేగుళ్ల కలుగజేసుకుని గడిచిన ఐదేళ్ల కాలంలోని వైకాపా ప్రభుత్వ హయాంలో ప్రశ్నించకుండా ఏం చేశారని ఎంపీటీసీ సభ్యుడిని నిలదీశారు. ఆయన గతంలో ఎన్ని సమావేశాలకు హాజరయ్యారని ఎమ్మెల్యేను తిరిగి ప్రశ్నించడంతో సభలో కొంతసేపు గందరగోళం నెలకొంది. రోజూవారీగా అనేక కార్యక్రమాలు ఉండడం వల్ల అన్ని సమావేశాలకు హాజరుకాలేమని, దీనిపై మీకు సమాధానం చెప్పాల్సిన పని లేదని ఎంపీటీసీ సభ్యుడు మధుపై ఎమ్మెల్యే వేగుళ్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ● రైతులు పండించిన ధాన్యాన్ని ఇష్టమైన మిల్లుకే తరలించే విషయంపై పూర్తి సమాచారాన్ని వ్యవసాయ సహాయకుల ద్వారా రైతులకు తెలియజేయాలని ఎమ్మెల్యే వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. ● అంగర పీహెచ్‌సీలో ఒక్కరే వైద్యులు ఉండడం వల్ల పేదలకు పూర్తి స్థాయిలో సేవలు అందడం లేదని, వెంటనే మరో వైద్యుడిని నియమించాలని అంగర 1 ఎంపీటీసీ సభ్యుడు అడ్డాల శ్రీనివాస్ కోరారు. ● ఆరు నెలలుగా నేలటూరులో విద్యుత్తు లైన్‌మెన్ లేక ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆ గ్రామ సర్పంచి కె.వీరన్న అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ● అచ్యుతాపురం పీహెచ్‌సీలో ఈసీజీ మెషీన్ పనిచేయడం లేదని, రక్త పరీక్షలు సక్రమంగా జరగడం లేదని స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులను నిలదీశారు. ● పాఠశాలల్లో జరుగుతున్న నాడు- నేడు పనులు, వాటి ప్రస్తుత పరిస్థితులపై పూర్తి సమాచారం ఇవ్వాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, వైస్ ఎంపీపీ సాకా శ్రీనివాస్, తహసీల్దార్ చిన్నారావు, సూపరింటెండెంటు రాజేంద్ర ప్రసాద్, పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రక్షణగోడ నిర్మించరూ...

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మారేడుబాక కాలువపై నిర్మించిన కల్వర్టుపై ఒక పక్క రక్షణ గోడ లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక వాహనం వస్తే రెండో వైపు వాహనదారుడు ఆగాల్సిన పరిస్థితి. రామచంద్రపురం మండలం నుంచి మండపేట, మారేడుబాక గ్రామాలకు ఇటుగానే వెళ్తుంటారు. వేలాదిగా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రాత్రి వేళల్లో వాహనాలను తప్పించే క్రమంలో కాలువలో పడిపోతున్న పరిస్థితి ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. కల్వర్టు వెడల్పు చేసి రక్షణగోడ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై ర.భ.శాఖ డీఈ సూర్యనారాయణను వివరణ కోరగా కల్వర్టు వెడల్పుకు ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపామన్నారు. ప్రస్తుతం రక్షణగోడ నిర్మాణం త్వరితగతిన పూర్తిచేయనున్నట్లు వెల్లడించారు.



ఆరోగ్య ఉపకేంద్రం నిర్మాణానికి వినతి

రాయవరం, న్యూస్‌టుడే: రాయవరం మండలం లొల్లలో ఆరోగ్య ఉపకేంద్ర భవన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు వినతిపత్రాన్ని గ్రామ సర్పంచి జానకీ రాంబాబు అందజేశారు. మంగళవారం సర్పంచి మాట్లాడుతూ విజయవాడ భాజపా కార్యాలయంలో జరిగిన 'వారధి' కార్యక్రమంలో సబ్‌సెంటర్ నిర్మాణానికి చొరవ తీసుకోవాలని మంత్రి యాదవ్‌కు విజ్ఞప్తి చేశామన్నారు. భవన నిర్మాణానికి గ్రామానికి చెందిన దాత ముళ్లపూడి రామకృష్ణ తొమ్మిది సెంట్ల స్థలాన్ని అందజేశారన్నారు. నిర్మాణానికి అవసరమైన తీర్మానాలను పంచాయతీ ఆమోదించిందని, ఉపకేంద్ర ఆవశ్యకతపై ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఇప్పటికే మంత్రి దృష్టికి తీసుకెళ్లారన్నారు. త్వరితగతిన ఆరోగ్య ఉపకేంద్ర భవనం పూర్తిచేయాలని మంత్రిని కోరామని సర్పంచి తెలిపారు.


మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచి

ద్విచక్ర వాహనం ఢీకొని మహిళ మృతి

కాజులూరు: ద్విచక్రవాహనం ఢీకొని ఆర్యవటం గ్రామానికి చెందిన గిరిజాల శ్యామల (63) మృతి చెందారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్యామల సోమవారం సాయంత్రం బంధువుల ఇంటికి పరామర్శకు వెళ్లి వస్తున్నారు. తన ఇంటి సమీపానికి వచ్చేసరికి అదే గ్రామానికి చెందిన మణికంఠ ద్రాక్షారామ నుంచి కాకినాడ వైపు ద్విచక్రవాహనంపై వేగంగా వచ్చి ఢీకొట్టాడు. దీంతో శ్యామల తీవ్రగాయాల పాలైంది. స్థానికులు, కుటుంబసభ్యులు కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందారు. దీనిపై ఎస్సై ఎం.మోహన్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మైదానం ఇలా.. ఆటలు ఎలా..?

మండపేట, న్యూస్‌టుడే: మండపేట పట్టణంలోని ఎస్‌వీఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానం తుప్పలు పెరిగి అస్తవ్యస్తంగా మారింది. ఈ పాఠశాల విద్యార్థులు ప్రతి సంవత్సరం క్రీడల పోటీల్లో పాల్గొని రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా రాణిస్తున్నారు. కనీస వసతులు లేని ఈ మైదానంలోనే శిక్షణ పొందుతూ క్రీడలపై వారి ఆసక్తిని చూపిస్తూ తాము సాధించిన రికార్డులతో ఎంతో మందికి స్ఫూర్తినిస్తున్నారు. గత సంవత్సరం దక్షిణ ఆఫ్రికాలో నిర్వహించిన టెన్నీకాయిట్ పోటీలో భారత దేశం తరపున పాల్గొని బంగారు పతకం సాధించిన వినయ్,రామారావులు శిక్షణ పొందిన మైదానం కూడా ఇదే. ఇటీవల జమ్మూకశ్మీర్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి క్రీడల పోటీల్లో ఈ పాఠశాల విద్యార్థులు పాల్గొని ప్రథమ స్థానం సాధించడం గమనార్హం. టెన్నీకాయిట్, బాల్‌బ్యాడ్మింటన్, త్రోబాల్, బాస్కెట్ బాల్, క్రికెట్ వంటి క్రీడల్లో ఎంతో మంది విద్యార్థులు రాణిస్తున్నారు. క్రీడల ద్వారా మండపేటకు జాతీయ , అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకు వస్తుంటే ఇక్కడ క్రీడాకారులకు కావాల్సిన సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. సమీపంలోని రామచంద్రపురంలో మాత్రం క్రీడామైదానంతోపాటు కోర్టులు కూడా ఎంతో సౌకర్యవంతంగా తీర్చిదిద్ది క్రీడలకు ఎంతో ప్రోత్సాహాన్ని అందిస్తున్నారు. ఇంత మంది క్రీడాకారులు ఉన్న మండపేటలో సౌకర్యాలు లేక ప్రోత్సాహం కరువైంది. మైదానం పూర్తిస్థాయిలో క్రీడలకు అనుకూలంగా మార్చలేకపోయినా కనీసం కోర్టులు మరమ్మతులు చేస్తే చాలని క్రీడాకారులు విజ్ఞప్తి చేస్తున్నారు. దీనిపై ప్రజా ప్రతినిధులు, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని క్రీడాకారులు, పాఠశాల ఉపాధ్యాయులు కోరుతున్నారు.


అస్తవ్యస్తంగా ప్రభుత్వ పాఠశాల క్రీడా మైదానం

అధికారులొస్తే ఎక్కడ ఉండాలో..!

మండపేట, న్యూస్‌టుడే: మండపేట పట్టణం నడిబొడ్డున బస్టాండ్ సమీపంలో ఉన్న ప్రభుత్వ అతిథి గృహం శిథిలావస్థకు చేరి సుమారు మూడు దశాబ్దాలైంది. అప్పట్లో జిల్లా కలెక్టర్లు, మంత్రులు సైతం మండపేట పర్యటనకు వచ్చినపుడు ఈ అతిథి గృహంలో విశ్రాంతి తీసుకునే వారు. జిల్లా పరిషత్‌కు చెందిన ఈ అతిథి గృహంలో ముఖ్యమైన సమావేశాలు కూడా ఇక్కడే నిర్వహించేవారు. రానురాను మరమ్మతులకు గురవడంతోపాటు పెంకుటింట్లో సౌకర్యాలు అంతంత మాత్రంగా ఉండడంతో నిరుపయోగంగా వదిలేశారు. దీనికి ఒక పక్క పంచాయతీరాజ్‌శాఖ డీఈ కార్యాలయం, మరోపక్క ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కార్యాలయం కూడా నిర్వహిస్తున్నారు. అవి కూడా శిథిలావస్థకు చేరినప్పటికీ ఆయా శాఖల ద్వారా మరమ్మతులు చేసుకుంటున్నారు. దీని పక్కనే దుకాణ సముదాయం కూడా జిల్లాపరిషత్ ఆధీనంలోనే ఉంది.. వాటికి సంబంధించి అద్దె రూపంలో జిల్లా పరిషత్‌కు ఆదాయం సమకూరుతోంది. ప్రధాన రహదారి పక్కన ఇంత ఖరీదైన స్థలం దశాబ్దాలుగా నిరుపయోగంగా మారినా సంబంధించిన అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదు. దశాబ్దంన్నర క్రితం నియోజకవర్గ కేంద్రంగా మారిన మండపేటకు అతిథి గృహం లేకపోవడం శోచనీయం. దీనిపై పంచాయతీరాజ్‌శాఖ డీఈ రామనారాయణను వివరణ కోరగా వసతిగృహం మరమ్మతులకు గాని నిర్మాణానికి గాని ఎటువంటి ప్రతిపాదన లేదన్నారు. ఉన్నతాధికారులు చొరవ చూపితే ఉపయోగంలోకి వస్తుందని తెలిపారు.


నిరుపయోగంగా ప్రభుత్వ అతిథి గృహం